

ఎమ్మెల్సీ వంశీకృష్ణకు నోటీసులు



విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు శాసన మండలి చైర్మన్ నోటీసులు జారీచేశారు. ఆయన ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ నేపథ్యంలో 'ఒక పార్టీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికై, వేరే పార్టీలోకి మారిన మీపై ఎందుకు అనర్హత వేటు వేయకూడదో చెప్పాలంటూ' నోటీసు పంపించారు. ఇది వారం రోజుల క్రితమే వచ్చినట్టు తెలిసింది. దీనికి సమాధానం ఇవ్వడానికి తనకు పది రోజుల వ్యవధి కావాలని వంశీకృష్ణ కోరినట్టు సమాచారం.

రైల్వే జోన్‌పై రాజకీయం!



జోనల్ కార్యాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లో భూములు అప్పగిస్తే మరుసటి రోజే శంకుస్థాపన చేస్తామన్న రైల్వే మంత్రి



ముడసర్లోవలో రైల్వే జోన్‌కు ఇవ్వడానికి జీవీఎంసీ అధికారులు ప్రతిపాదించిన భూములు

- ముడసర్లోవలో 52 ఎకరాలు తీసుకోవచ్చునంటూ డీఆర్ఎంకు జీవీఎంసీ మునిసిపల్ కమిషనర్ లేఖ
- అందులో 20 ఎకరాలు నీటి వనరులు ఉన్నాయంటూ ప్రస్తావన
- లేఖ రాసినంత మాత్రాన భూములు అప్పగించినట్టు కాదంటున్న రైల్వే అధికారులు
- అందులో ఆక్రమణలు కూడా తొలగించలేదని ఆక్షేపణ
- ...ఇటువంటి తరుణంలో ఫిబ్రవరిలో శంకుస్థాపన అంటూ అనకాపల్లి ఎంపీ ప్రకటన
- ఎన్నికల ముందు శంకుస్థాపనకు బీజేపీ నేతల పట్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలతో రాజకీయ నాయకులు ఆటలాడుకుంటున్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని మూడు దశాబ్దాలుగా ప్రజా పోరాటం చేస్తుంటే...ప్రధాని నరేంద్రమోదీ గత ఎన్నికల ముందు 2019లో 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచీ ఆయనే ప్రధానిగా ఉన్నా ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో దానిపై రాజకీయ నాయకులు తలో మాట చెబుతున్నారు.

కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ గత నెల (డిసెంబరు) 10వ తేదీన విశాఖపట్నం వచ్చినప్పుడు జోన్ గురించి ప్రశ్నిస్తే... కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వమే జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. భూములు వారం రోజుల్లో అప్పగిస్తే ఆ మరుసటిరోజే తాను భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తానని ప్రకటించారు. ఇక్కడే మరో ముడి పడింది. రైల్వేకు భూములు అప్పగించాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కు, జీవీఎంసీకి అప్పగించింది. ఆ రోజున కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్‌వర్మ వారం రోజుల్లో ముడసర్లోవ భూములను అప్పగిస్తామని రైల్వే మంత్రికే హామీ ఇచ్చారు. ఇదంతా విశాఖ బీజేపీ నాయకుల సమక్షంలో జరిగింది. ఇచ్చిన హామీ నిలుపుకున్నామని చెప్పడానికి జీవీఎంసీ అధికారులు 'ముడసర్లోవలో 52 ఎకరాల భూములు సిద్ధంగా ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకోవచ్చు' అంటూ డీఆర్ఎంకు ఓ లేఖ రాశారు. 'ఆ భూముల్లో 20 ఎకరాల్లో నీటి వనరులు ఉన్నాయి.' అంటూ ఇంకో వాక్యం జత చేశారు. దీంతో తమ బాధ్యత తీరిపోయినట్టుగా, భూములు అప్పగించినట్టుగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది.

రైల్వే వర్గాలు ఏమంటున్నాయంటే...?

ముడసర్లోవ భూముల్లో ఆక్రమణదారులు ఉన్నారని, వారిని అక్కడి నుంచి పంపించి ఆ భూములు అప్పగించాలని తాము కోరితే...ఆ విషయం ప్రస్తావించకుండా వాటిని స్వాధీనం చేసుకోవాలని లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉందని రైల్వే వర్గాలు ... మిగతా 4వ పేజీలో

సౌత్‌లో వైసీపీకి ఎదురుగాలి



ఎన్నికల ముంగిట నియోజకవర్గంలో అయోమయ పరిస్థితి

- ఇప్పటికే ఇద్దరు కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిక
- ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానానికి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కూడా గుడ్‌బై
- వాసుపల్లికి టికెట్ ఇస్తే సహకరించబోమంటున్న కార్పొరేటర్లు
- ఇటీవల నలుగురిని సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన అధిష్ఠానం
- నాలుగు రోజుల క్రితం శాసనసభ్యుడు ఏర్పాటుచేసిన సమావేశానికి ఒకే ఒక్క కార్పొరేటర్ హాజరు
- మరోవైపు సొంత సామాజికవర్గంలోనూ వాసుపల్లిపై వ్యతిరేకత
- తాజా పరిణామాలతో అయోమయంలో కార్యకర్తలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముంగిట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో పరిస్థితులు ప్రతికూలంగా మారుతు న్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను వచ్చే ఎన్నికల్లో పోటీకి దింపాలని నిర్ణయించిన తర్వాత ఒకరి తర్వాత ఒకరు కార్పొరేటర్లు పార్టీకి దూరమవుతున్నారు. సీఎం పర్యటనపై ఆయన ఇటీవల ఏర్పాటుచేసిన సమావేశానికి ఒకే ఒక్క కార్పొరేటర్ హాజరయ్యారు. మరోవైపు ఎమ్మెల్యేపై సొంత సామాజికవర్గం నుంచి కూడా తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



వాసుపల్లి గణేష్‌కుమార్

2019 ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్ తర్వాత వైసీపీ పంచన చేరారు. అయితే అప్పటికే వైసీపీలో ఉన్న నేతలకు, వాసుపల్లికి మధ్య సఖ్యత కుదరలేదు. దక్షిణ నియోజకవర్గంలో 12 వార్డులు పూర్తిగా, రెండు వార్డులు పాక్షికంగా ఉండగా జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ ఏడింటిని గెలుచుకుంది. మూడు టీడీపీ, ఒకటి జనసేన దక్కించుకోగా, మూడుచోట్ల ఇండిపెండెంట్లు గెలుపొందారు. ఫలితాలు వచ్చిన తర్వాత ఇండిపెండెంట్లుగా గెలిచిన ముగ్గురితోపాటు టీడీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్ ఒకరు వైసీపీలో చేరడంతో వైసీపీ బలం నియోజకవర్గంలో 11కి పెరిగింది. అయితే అందులో కొందరు మొదటి నుంచి వాసుపల్లిని వ్యతి రేకిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో వాసుపల్లికి టికెట్ ఇస్తున్నట్టు అధిష్ఠానం పరోక్షంగా ప్రకటించడంతో నియోజకవర్గంలో ముసలం మొదలైంది. వాసుపల్లి వ్యవహారశైలి బాగోలేదంటూ...ఇండి పెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ పార్టీని వీడి జనసేనలో చేరిపోయారు. ఇక పార్టీ ఆవిర్భావం నుంచి ఉండి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానానికి పోటీ చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కూడా వాసుపల్లితో కలిసి పనిచేయలేనంటూ రెండు వారాల కిందట వైసీపీకి రాజీనామా చేశారు. అదేవిధంగా వాసుపల్లికి టికెట్ ఇస్తే సహకరించబోమని 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి వైసీపీకి మద్దతుగా నిలిచిన 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పలుమార్లు బహిరంగంగానే ప్రకటించారు. వైసీపీకి రాజీనామా చేసిన సీతంరాజు సుధాకర్‌తో వారం రోజుల కిందట నలుగురు కార్పొరేటర్లు విలేకరుల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే వాసుపల్లిపై తీవ్రస్థాయిలో విమర్శలు ... మిగతా 4వ పేజీలో

పోలీస్ శాఖలో బదిలీల హడావుడి

- మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న వారికి స్థానచలనం
- ఎన్నికల నేపథ్యంలో తమకు అనుకూలంగా ఉండే వారిని నియమించాల్సిందిగా సీపీపై అధికార పార్టీ నేతల ఒత్తిడి

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో బదిలీల పర్వం కొనసాగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్లకుపైగా నగరంలో పనిచేస్తున్న వారిలో చాలా మందిని ఇప్పటికే విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు. నగర కమిషనరేట్‌లో మరికొందరు సీఐలు మూడేళ్లకుపైగా సర్వీసు కలిగి ఉండడంతో వారిని కూడా బదిలీ చేయాల్సి ఉంది. స్పెషల్‌బ్రాంచి, శిక్షణ కాలేజీ, సీసీఆర్‌బీ వంటి లూప్‌లైన్‌లో ఉన్నవారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడంతో ఆయా పోస్టుల కోసం పోటీ పెరిగింది. మరోవైపు నగరంలో పనిచేస్తున్న వారిని రేంజ్‌కు బదిలీ చేస్తుండడంతో వారి స్థానంలో నగరానికి వచ్చేందుకు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులు పైరవీలు సాగిస్తున్నారు. మరోవైపు అధికార పార్టీ నేతలు వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమకు అనుకూలంగా ఉండే అధికారులకు తమ పరిధిలోని స్టేషన్లలో సీఐ పోస్టింగ్‌లు ఇప్పించుకునేందుకు ముఖ్యనేతల ద్వారా సీపీపై ఒత్తిడి చేస్తున్నట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

సంపులో పడి బాలుడి దుర్మరణం



రాకేష్ రోషన్ (8) (ఫైల్ ఫొటో)

- కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు
- దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంఘటన

.. వార్త 4వ పేజీలో



లీలామహల్ జంక్షన్ - చిత్రాలయ షాపింగ్‌మాల్ రహదారి

ప్రజా ధనం పక్కదారి

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం దుబారా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఇంజనీరింగ్ విభాగంలో కొంత మంది అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేస్తే సరిపోయే చోట లక్షలాది రూపాయలు వెచ్చించి కొత్తగా తారురోడ్డు నిర్మించేందుకు తహతహలాడుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జోన్-4 పరిధిలో లీలామహల్ జంక్షన్ నుంచి చిత్రాలయ షాపింగ్‌మాల్ వరకూ ఉన్న రోడ్డుపై రూ.45.46 లక్షలతో కొత్త తారు లేయర్ వేయడానికి ప్రతిపాదనలు తయారుచేయడం చర్చనీయాంశంగా మారింది.

- బాగున్న రోడ్డునే మళ్లీ పునర్నిర్మిస్తారట...
- లీలామహల్ జంక్షన్-చిత్రాలయ షాపింగ్‌మాల్ రోడ్డుపై లేయర్‌కు రూ.45.46 లక్షలతో ప్రతిపాదనలు
- చిన్నపాటి ప్యాచ్‌వర్కులతో సరిపోయే చోట అనవసరంగా నిధులు ఖర్చు
- కమీషన్ల కోసమేననే విమర్శలు

ఇంజనీరింగ్ విభాగంలో కొంతమంది అధికారులు కమీషన్లే పరమావధిగా పనులకు ప్రతిపాదనలు తయారుచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఎంతవరకు అవసరం...అనేదానికంటే కూడా పర్సంటేజీలు ఎక్కువ వచ్చే పనుల పట్ల అమితాసక్తి కనబరుస్తున్నారు. నగర సుందరీకరణ పేరుతో చక్కగా ఉన్న రోడ్లను కూడా పునర్నిర్మించాలంటూ ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు సైతం ఆ పనిచేయకుండా కిందిస్థాయి అధికారుల ప్రతిపాదనలను ఆమోదించి స్టాండింగ్ కమిటీ ముందుకు పంపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సిరిపురం కూడలి పరిసరాల్లో పలు రోడ్లతోపాటు వీఐపీ రోడ్డు బాగానే ఉన్నప్పటికీ, కొత్తగా నిర్మాణానికి ప్రతిపాదించగా, తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. తాజాగా జోన్-4 పరిధి లీలామహల్ జంక్షన్ నుంచి చిత్రాలయ షాపింగ్‌మాల్ వరకూ ఇరువైపులా ఉన్న రోడ్డును రూ.45.46 లక్షలతో పునర్నిర్మాణం చేసేందుకు ప్రతిపాదన తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ఎజెండాలో చేర్చారు. ఆ రోడ్డు ప్రస్తుతం బాగానే ఉంది. ఒకటి, రెండు చోట్ల చిన్నపాటి గుంతలు ఉన్నప్పటికీ, వాటిని ప్యాచ్ వర్కుతో సరిచేయవచ్చు. కానీ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం కొత్తగా రోడ్డు నిర్మించాలని నిర్ణయించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బాగానే ఉన్న రోడ్డుపై రూ.45.46 లక్షలు వెచ్చించి కొత్తగా రోడ్డు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ జోన్-4లోనే కొంతమంది అధికారులు సైతం ప్రశ్నిస్తుండడం విశేషం. నగరంలో చాలా ప్రాంతాల్లో సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు అలాంటి ప్రాంతాలపై దృష్టిపెట్టకుండా బాగున్న వాటిపైనే శ్రద్ధ పెట్టడంపై రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి. కొత్తగా రోడ్డు నిర్మించడం కంటే బాగున్న రోడ్డుపై కొత్తగా మరొక లేయర్ వేసే పనిలో కాంట్రాక్టర్‌కు ఎక్కువ మిగులుతుందని, దీనివల్ల కమీషన్లు కూడా అధికారులకు బాగా ముడతాయని అంటున్నారు. అందుకే ఇలాంటి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారని అభిప్రాయ పడుతున్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని గుర్తించి ఇంజనీరింగ్ అధికారుల కక్కుర్తికి అడ్డుకట్టవేసేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది హవా!

అధికారుల అండతో జీవీఎంసీలో అక్రమాలు

- గతంలో 'సౌకర్యం' కేంద్రంలో వెలుగుచూసిన కుంభకోణం
- ఇటీవల బయటపడిన ఈఎండీల బాగోతం
- తాజాగా మరో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



జీవీఎంసీలో కొంతమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారు. నగర పాలక సంస్థకు చేరాల్సిన సొమ్మును అధికారుల అండదండలతో దారిమళ్లించేస్తున్నారు. అదేవిధంగా నకిలీ పత్రాలతో ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు జారీచేసేస్తున్నారు.

జీవీఎంసీలో ఎనిమిది వేల మంది వరకూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో కంప్యూటర్‌పై అవగాహన కలిగివుండి, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేసేవారు 180 మంది వరకూ ఉంటారు. వీరిలో కొంత మంది చాలాకాలంగా ఒకేచోట పాతుకుపోయి ఉండడంతో జీవీఎంసీకి సంబంధించిన నిధులను పక్కదారి పట్టించడంలో ఆరితేరిపోయారు. వెబ్‌సైట్‌తోపాటు సాంకేతికపరమైన లోపాలను ఆసరాగా తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో తరచూ ఏదో ఒకచోట నిధుల స్వాహా ఉదంతాలు బయటపడుతున్నాయి. కొన్నేళ్ల కిందట సౌకర్యం కేంద్రంలో చెల్లించే ఆస్తి పన్నును జీవీఎంసీ ఖాతాకు కాకుండా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది కొందరు తమ ఖాతాలతోపాటు తమ కుటుంబసభ్యులు, స్నేహితుల ఖాతాలకు మళ్లించేశారు. కొన్నాళ్లకు కుంభకోణం బయటపడడంతో పోలీసు కేసు నమోదైంది. జీవీఎంసీ ఖాతాకు చేరకుండా పోయిన మొత్తంలో కొద్దిమొత్తాన్ని మాత్రమే పోలీసులు రికవరీ చేయగలిగారు. ఇటీవల జోన్-8 పరిధిలో ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నకిలీ పత్రాలతో ఏకంగా ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు జారీ చేసేయడంతో అతడ్ని ఉద్యోగం నుంచి తొలగించారు. సదరు ఉద్యోగికి అప్పటి జోనల్ కార్యాలయంలోని అధికారి అండదండలున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటీవలే ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏకంగా జీవీఎంసీ కమిషనర్ పేరిట ... మిగతా 4వ పేజీలో

మాజీ మంత్రి కొణతాలతో షర్మిల భేటీ

సుమారు 20 నిమిషాలపాటు చర్చలు

- వ్యక్తిగత పరిచయంతోనే వచ్చా... రాజకీయ కారణాలు లేవు: షర్మిల
- జనసేనలో చేరుతున్నట్టు ఇప్పటికే చెప్పా: కొణతాల
- టీడీపీ, జనసేన కూటమితోనే వైసీపీని గద్దె దింపడం సాధ్యమని ప్రకటన

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం రాత్రి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణతో భేటీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్న ఆమె...సర్క్యూట్ హౌస్ సమీపంలో గల కొణతాల ఇంటికి వెళ్లారు. ఆమె వెంట పీసీసీ మాజీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, ఇతర నాయకులు ఉన్నారు. సుమారు ఇరవై నిమిషాలపాటు కొణతాలతో చర్చలు జరిపారు. అనంతరం బయటకు వచ్చిన షర్మిల మీడియాతో మాట్లాడారు. కొణతాల రామకృష్ణ తన తండ్రితో కలిసి పనిచేశారని, వ్యక్తిగత పరిచయంతోనే వచ్చి కలిసినట్టు వెల్లడించారు. కొణతాల తనకు అంకుల్ అని, అందుకే ఇంటికి వచ్చానన్నారు. చాలాకాలం తరువాత కలిశామని, రాజకీయాలు కూడా మాట్లాడామని, అవసరమైనప్పుడు చెబుతామన్నారు. ఈ కలయికకు రాజకీయ కారణాలు లేవని ఆమె స్పష్టంచేశారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ... మిగతా 4వ పేజీలో



కొణతాల రామకృష్ణతో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

టాలెంట్ సెర్చ్‌లో కేవీ విద్యార్థికి 53వ ర్యాంక్



నగదు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, జనవరి 23: సింగపూర్‌కు చెందిన సముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెరిటైమ్ స్టడీస్, లోనవల ఎగ్జిక్యూటివ్ షిప్‌మేనేజ్‌మెంట్ నిర్వహించిన ఆలిండియా టాలెంట్ సెర్చ్ పరీక్షలో తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరు విద్యార్థి ప్రియంగ్షు ఘోష్‌కు 53వ ర్యాంక్ లభించింది. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం ఆ విద్యార్థికి కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ రూ.1000 బహుమతి, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష పే చర్చ, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు.

'వేతన సవరణ అమలు చేయాలి'

డాబాగార్డెన్స్, జనవరి 23: వేతన సవరణ వెంటనే అమలు చేయాలని బీఎస్ఎన్ఎల్ జాయింట్ ఫోరం ఆఫ్ నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్స్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే వేజ్ రివిజన్ చేయాలన్నారు. 4జీ, 5జీ అమలుకు ఎటువంటి ఆటంకాలు సృష్టించవద్దని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు కొత్త ప్రమోషన్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అసోసియేషన్ కన్వీనర్ సాగర్, చైర్మన్ రామాంజనేయులు, అష్రప్, లచ్చిరాజు, ఉమాదేవి, రాధ, ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, జనవరి 23 : కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రాంగణంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 25వ తేదీ గురువారం జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు సబ్‌రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఈమేళాలో ఆప్టెక్ కన్సల్టెంట్స్, ఫ్యూచర్ మేన్ పవర్ కంపెనీలు పాల్గొని యువతకు ఎంపికలు నిర్వహించనున్నాయి. నర్సింగ్ స్టాఫ్, హోం కేర్ టేకర్ ఉద్యోగాలకు ఇంటర్ బైపీసీ, ఎఎన్ఎం, జీఎన్ఎం, జీడీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వారితో ఆపరేటర్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఆసక్తి, అర్హత గల యువత ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేయాలని శ్యామ్ సుందర్ నిట్టల కోరారు. ఆ రోజు ఉదయం 9గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

53వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మర్రిపాలెం, జనవరి 23: గ్రేటర్ 53వ వార్డు మర్రిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్తర నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కేకే రాజు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అర్హులు పొందుతున్న లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో సమస్యను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తో కలసిరావాలి'

డాబాగార్డెన్స్, జనవరి 23: తూర్పు నియోజకవర్గంలో ఉన్న కాపులంతా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసిరావాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి కోరారు. చిన్ననాటినుంచి సమాజంలో మార్పుతేవాలనే ఆలోచనతోపాటు చదువుకుంటే సమాజానికి ఏదైనా చేయవచ్చుననే భావనంతో పెరిగానన్నారు. విద్యావంతురాలిగా ఇప్పుడు సమాజాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాజకీయాలతోనే మార్పు సాధ్యమని భావించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. కాపు సామాజికవర్గం అన్ని విధాలా తనకు అండగా ఉంటుందని ఆశిస్తున్నానన్నారు. గతంలో హనుమంతువాక కొండవాలు ప్రాంత సమస్యలను గుర్తించి పోరాడానన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి..

సీతమ్మధార, జనవరి 23: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార ఎస్ఆర్ నగర్, వోల్వో ఆఫీస్, క్షత్రియ కళ్యాణ మండపం, అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రాంతం, రాకెట్ పార్క్ ప్రాంతం, హిల్ వ్యూ పార్క్, అభయాంజనేయ స్వామి ఆలయం, బీజేపీ ఆఫీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రాంతం, సాయిబాబా టెంపుల్, ఎస్ఆర్ఐ ఆసుపత్రి వెనుక తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విశాఖపట్నం, జనవరి 23: రైల్వే స్టేషన్‌లోని ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతని వయస్సు55 నుంచి 60 ఏళ్లు, ఎత్తు 5.9 అంగుళాలు ఉండవచ్చుని, నీలి రంగు షర్టు ధరించినట్టు వారు తెలిపారు., అనారోగ్యంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసినవారు విశాఖ జీర్పీ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీహెచ్.ధనుంజయనాయుడు ఫోన్: 94406 27547, ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఫోన్: 98664 13487లకు సమాచారం అందించాలి.



ఆశ్రమంలో అంధ విద్యార్థులకు అన్నదానం



లోకేశ్ బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న ఉత్తర నియోజకవర్గ టీడీపీ నాయకులు

టీడీపీ గెలుపే ధ్యేయం కావాలి

» యువనేత లోకేశ్ జన్మదిన వేడుకల్లో నాయకుల పిలుపు

అక్కయ్యపాలెం, జనవరి 23 : రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విజయ్‌బాబు కేక్ కట్ చేసి పంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ ప్రజల కష్టాలు తెలుసుకొనేందుకు యువగళం పేరిట పాదయాత్ర నిర్వహించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈతలపాక సుజాత, బొడ్డేటి మోహన్, వాసుపల్లి రాజు, పొ లమరశెట్టి శ్రీనివాస్, మొల్లేటి కుమారస్వామి, యాగాటి ఆదిలక్ష్మి, గొలగాని సౌజన్య సనపల కీర్తి తదితరులు పాల్గొన్నారు. విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో 44వ వార్డులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, కృష్ణ, నిర్మల, పుష్ప, మోహనరావు, పందిరిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. విశాఖపార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్, 42వ వార్డు టీడీపీ అధ్య క్షుడు కన్నం వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనపాల కృష్ణ, శ్రీకృష్ణ, పిలక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు భోజన వసతి

మహారాణిపేట: నారా లోకేష్ జన్మదినోత్సవం సందర్భంగా బధిర విద్యార్థులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నదానం చేశారు. మంగమారిపేటలో చిన్న జియ్యర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారిజా ఆశ్రమ విద్యాలయంలో అంధులు, బధిర చిన్నారులకు భోజనంతోపాటు స్వీట్లను అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ పుట్టిన రోజు టీడీపీ పండగరోజులాంటిదన్నారు. ఆయనరాజకీయాల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

వాల్తేరు డివిజన్ అభివృద్ధిలో సిబ్బంది కృషి భేష్

» డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్



విశిష్ట రైల్ పురస్కార గ్రహీతలను సత్కరించిన డీఆర్ఎం

విశాఖపట్నం, జనవరి 23: వాల్తేర్ డివిజన్ అభివృద్ధి పథంలో నడిపించడంలో సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ కొనియాడారు. ఇటీవల విశిష్ట రైల్ పురస్కార్ అవార్డులందుకున్న వాల్తేరు డివిజన్ పరిధిలోని ఉద్యోగులను మంగళవారం తన కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ రైల్వేలో వాల్తేరు డివిజన్‌ను మరింత అత్యున్నత స్థాయికి చేర్చేందుకు చిత్తశుద్ధితో సేవలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం అవార్డు గ్రహీతలతో నేరుగా మాట్లాడి వారిని ప్రశంసించారు. కాగా, కేకే లైనులోని మన్‌బాత్- జరాతీ సెక్షన్ మధ్య గత సెప్టెంబరులో కొండచరియలు విరిగిపడి సమయంలో త్వరితగతిన పనులను చేపట్టి ట్రాక్‌ను పునరుద్ధరించిన డివిజన్ బృందాలను ప్రత్యేక సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీ ర్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు.

తైక్వాండోలో ఆంధ్రాకు ఓవరాల్ చాంప్ ట్రోఫీలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 23: జాతీయ సీనియర్, జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్రా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని సవాయి మాదాపూర్‌లో జరిగిన ఈ టోర్నీలో సీనియర్ కేటగిరి పూంసే ఈవెంట్‌లో ఆంధ్రా క్రీడాకారులు ఆరు స్వర్ణ, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలతో ఓవరాల్ చాంపియన్స్‌గా నిలవగా, జూనియర్ కేటగిరిలో ఆరు స్వర్ణ, ఐదు రజత, ఐదు కాంస్య పతకాలతో ఓవరాల్‌గా ద్వితీయ స్థానాన్ని సాధించారు.పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్‌లను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.అచ్యుతరెడ్డి, సి.వేణుగోపాలరావు, అభినందించారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది హవా!

... 3వ పేజీ తరువాయి

నకిలీ పత్రాలతో బ్యాంకులో ఒక ఖాతా తెరిచాడు. కాంట్రాక్టర్లు ఈఎండీగా చెల్లించే మొత్తాన్ని ఆ ఖాతాకు జమ చేయడం మొదలెట్టాడు. ఇలా నాలుగైదేళ్ల పాటు రూ.50 కోట్ల వరకూ దారి మళ్లించేశాడు. విషయం బయటపడడంతో పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే కేసు లేకుండా చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు శతవిధాలా ప్రయత్నించినట్టు సమాచారం. తాజాగా ఈ విభాగంలోనే ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వద్ద పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులు అలాంటిదేమీ లేదని, పుకార్లేనని కొట్టి పారేస్తున్నప్పటికీ...భారీ కుంభకోణమే జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత

» జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు

సీతంపేట, జనవరి 23: జాతికి స్ఫూర్తి ప్రదాత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ అని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేడ్కర్ సామాజిక న్యాయమహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం పేరిట రామాటాకీస్ రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఇంటింటి రాజ్యాంగం, అండమాన్‌కు చెందిన బతుకుల అప్పారావు సమర్పించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యూపీఎస్సీ మెంబర్, ద్రవిడ యూనివర్శిటీ విశ్రాంత చాన్సలర్ ఆచార్య కేఎస్ చలం, ఏయూ ఆంత్రోపాలజీ హెచ్‌ఓడీ ఆచార్య సత్యపాల్, పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ వీర్రాజు అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరించారు. వివిధ విభాగాల ప్రతినిధులు వి.మధుసూదనరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, కె.రామారావు, ఆర్.పూర్ణిమాదేవి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్ ఏర్పాటుకు సహకరించాలి

» యూనియన్ అధ్యక్షులు ఖాజావల్లి



ఆటోనగర్‌కు సంబంధించిన నమూనా చూపుతున్న ఖాజావల్లి

డాబాగార్డెన్స్, జనవరి 23: వేలాది మంది కార్మికుల ప్రయోజనార్థం ఆనందపురం కనమాం లో రాజన్న ఆటోనగర్ నిర్మాణానికి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా సహకరించాలని రాజన్న ఆటోనగర్ యూనియన్ అధ్యక్షులు ఖాజావల్లి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోమొబైల్ రంగంపై ఆధారపడి ఆనందపురం, తరగపువలస నుంచి టౌన్ కొత్తరోడ్డు, పెందుర్తి నుంచి ఎంవీపీ కాలనీ వరకు విస్తరించి ఉన్నారన్నారు. ఈ రంగంలో 10 వేల మంది ఆటోమొబైల్ మెకానిక్ ఓనర్స్, వర్కర్లు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా నగర పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలందరూ ఆటోనగర్ శంకుస్థాపనకు సహకరించాలని కోరారు. యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఆటోనగర్ భూములకు సంబంధించి రైతులకు చెక్కులిచ్చిన సమయంలో పదిరోజుల్లో పరిహారం చెల్లిస్తామని ప్రకటించి ఇప్పటికి ఆరునెలలు గడిచిందన్నారు. ఈస్థితిలో వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి చొరవ తీసుకుని చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ఆటోనగర్ పూర్తికి ఆయన సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేతాజీ త్యాగం మరువలేం

కంచరపాలెం, జనవరి 23: స్వాతంత్ర సమర యోధుడు సుభాష్ చం ద్రబోస్ త్యాగం మరువలేనిదని ఉత్తర జనసేన నాయకులు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఉత్తర జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొనికంచరపాలెం ఫ్లైఓవర్ వద్ద గల నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. సొంత సైన్యం ఏర్పాటుచేసుకుని బ్రిటీష్ పాలకులకు బోస్ వణికించారన్నారు. యువత నేతాజీ చూపించిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు ముమ్మిన నాగమణి, అడబాల నాగమణి,దుర్గా రెడ్డి, గౌరీ, మోషేస్ తదితరులు పాల్గొన్నారు.

జయంతిని పురష్కరించుకుని నేతాజీ విగ్రహానికి వైసీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సతీష్, శశికళ, కె.పి.రత్నాకర్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు వేడుకలు



బోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

మురళీనగర్, జనవరి 23 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి అధ్యక్షతన క్లబ్ పూర్వ సభ్యులు బుచ్చయ్య చౌదరి, ఆర్.సత్యనాథం తదితరులు బోస్ చిత్రానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు, అతిథులు, వాకర్స్ ప్రతినిధులు సుభాష్ చంద్రబోస్ గొప్పదనంపై మాట్లాడారు. ఆయనను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

సంపులో పడి బాలుడి దుర్మరణం

» కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు

» దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంఘటన

కూర్మన్నపాలెం, జనవరి 23: మురుగు నీటిని శుద్ధిచేసే ప్లాంట్ సంపులో జారిపడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

జీవీఎంసీ 86వ వార్డు రాసాలమ్మ కాలనీకి లక్కరాజు ఉదయ్‌చంద్, శోభ దంపతుల కుమారుడు రాకేష్ రోషన్ (8) ఉన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత స్నేహితుడు సందీప్‌తో కలసి కుక్క పిల్లలతో ఆడుకునేందుకు యాతపాలెం వెనుక ఉన్న మురుగునీటి శుద్ధి కర్మాగారానికి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తరువాత బిస్కెట్లు తీసుకురమ్మని సందీప్‌ను ఇంటికి పంపించి రాకేష్ అక్కడే ఉండిపోయాడు. కుక్కపిల్లలతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సంపులో పడిపోయాడు. ఈ సమయంలో ఆ సమీపంలో ఎవరూ లేకపోవడంతో సంపులోని నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. బయటకు వెళ్లిన కుమారుడు ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం ఉదయం సంపులో బాలుడి మృతదేహం తేలడాన్ని స్థానికులు చూశారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని వెలికితీశారు. రోషన్ తల్లిదండ్రులకు తెలియపరచడంతో వారు వచ్చి గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా?

నీటి విభాగం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగునీటి శుద్ధి కర్మాగారానికి గేట్లు లేకపోవడంతో చిన్నపిల్లలు అక్కడ ఆడుకోవడానికి వెళ్తున్నారని, ఈక్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. చిన్నపిల్లలు ఆ ప్రాంతానికి వస్తే గుర్తించి, వారించాల్సిన సిబ్బంది అసలు విధుల్లో ఉన్నారో లేరో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే జోన్‌పై రాజకీయం

... 3వ పేజీ తరువాయి

చెబుతున్నాయి. అంతేకాకుండా కొత్తగా ఆ భూముల్లో 20 ఎకరాల్లో నీటి వనరులు ఉన్నాయని చెబుతున్నారని కూడా ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఈ లేఖ అందిన తరువాత అక్కడికి వెళ్లి పరిశీలిస్తే ఆక్రమణదారులు అలాగే ఉన్నారని, నీటి వనరులు ప్రస్తుతానికి ఏమీ లేవని, వర్షాలు పడితే నీరు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. 52 ఎకరాల్లో 20 ఎకరాలు నీటి వనరులైతే...32 ఎకరాలనే ఉపయోగించుకోవలసి ఉంటుందని, అవి కూడా ఆక్రమణలు తొలగించాకే ఇవ్వాల్సి ఉంటుందని అంటున్నారు. లేఖ రాస్తే భూములు అప్పగించినట్టు ఎలా అవుతుందని, వాటికి సంబంధించిన పత్రాలు ఇవ్వాలని, అటువంటిదేమీ ఇప్పటివరకు జరగలేదని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

ఎన్నికల ముందు శంకుస్థాపనకు బీజేపీ నేతల పట్టు

గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయని, జోన్ ఏర్పాటుకు రూ.106 కోట్లు కేటాయించినా, పనులు ప్రారంభించకపోవడంపై సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ఉత్తరాంధ్ర బీజేపీ నాయకులు ఢిల్లీలో మొర పెట్టుకుంటున్నారు. జోన్ కార్యాలయాల శంకుస్థాపనకు ఏదో ఒక తేదీ ప్రకటించాలని కేంద్ర నేతలను కోరుతున్నారు. అందుబాటులో ఉన్న భూముల్లోనే ఎక్కడో ఓ చోట శంకుస్థాపన చేస్తే కొంత వరకు ప్రజలకు సమాధానం చెప్పుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నట్టుగా సమాచారం.

కొణతాల మాటలకు కౌంటర్‌గా ఎంపీ సత్యవతి ప్రకటన

మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం అనకాపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో రైల్వే జోన్ హామీ నిలుపుకోలేదని విమర్శించారు. దీనికి కౌంటర్‌గా అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి సోమవారం అక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి, ఫిబ్రవరిలోనే రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరుగుతుందని ప్రకటించారు. అది రాజకీయ విమర్శలను తిప్పికొట్టడానికి చేసిన ప్రకటనే తప్ప అందులో వాస్తవం లేదని, దానిపై ఇంత వరకు తమకు ఎటువంటి సమాచారం లేదని రైల్వే వర్గాలు స్పష్టంచేశాయి.

నోరు మెదపని విశాఖ నాయకులు

విశాఖపట్నంలో రైల్వే జోన్‌పై వైసీపీకి చెందిన నాయకులు గానీ, బీజేపీలో హడావుడి చేస్తున్న నాయకులు గానీ ఇప్పుడు ఏమీ మాట్లాడడం లేదు. వైసీపీ నాయకులైతే అది తమకు సంబంధించిన విషయం కాదన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు. జోన్ పనుల ప్రారంభంపై ఇక్కడ ఏ నాయకుడికీ స్పష్టమైన సమాచారం లేకపోవడం గమనార్హం.

'సౌత్'లో వైసీపీకి ఎదురుగాలి

... 3వ పేజీ తరువాయి

గుప్పించారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం సీరియస్‌గా పరిగణించి ఆ నలుగురు కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీనివల్ల మిగిలిన కార్పొరేటర్లు వాసుపల్లికి వ్యతిరేకంగా మాట్లాడరని పార్టీ పెద్దలు భావించినప్పటికీ మరో ముగ్గురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడిపోవాలనే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల 19న ఎమ్మెల్యే వాసుపల్లి తన కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశానికి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఒక్కరే హాజరయ్యారు. 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, టీడీపీ నుంచి గెలిచి తర్వాత వైసీపీకి మద్దతుగా నిలిచిన 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండలు గైర్హాజరయ్యారు. వాసుపల్లిపై కార్పొరేటర్లలో ఉన్న వ్యతిరేకతకు అంతకంటే నిదర్శనం ఏం కావాలని ఆయన వ్యతిరేక వర్గం ప్రచారం ప్రారంభించింది.

మరోవైపు వాసుపల్లికి సొంత సామాజికవర్గంలో కూడా మద్దతు కరువైంది. ఆయనకు టికెట్టు ఇవ్వొద్దని, ఒకవేళ ఇచ్చినా తాము సహకరించబోమంటూ ఆ మధ్య మత్స్యకార సంఘ నేతలు బహిరంగంగానే ప్రకటించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోందని, అధిష్ఠానం కూడా నివారణ చర్యలపై దృష్టిసారించకుండా మొండిగా ముందుకువెళుతోందంటూ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మాజీ మంత్రి కొణతాలతో షర్మిల భేటీ

... 3వ పేజీ తరువాయి

షర్మిలను కలిసి చాలా కాలమైందని, అందుకే ఇంటికి వచ్చారన్నారు. రాజశేఖర్‌రెడ్డితో తాను కలిసి పనిచేశానని, ఇది కేవలం వ్యక్తిగత పర్యటన మాత్రమేనని స్పష్టంచేశారు. రాజకీయాలతో ముడి పెట్టవద్దని కోరారు. మేనమామ ఇంటికి మేనకోడలు వచ్చినట్టు షర్మిల వచ్చారని స్పష్టం చేశారు. తాను జనసేనలో చేరుతున్నట్టు ఇదివరకే స్పష్టంగా చెప్పానని, రాష్ట్ర భవిష్యత్తు తనకు ముఖ్యమన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఆకాంక్షలను జగన్ నెరవేర్చలేకపోయారన్నారు. స్టీల్‌ప్లాంటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిందని, కానీ అది కూడా జరగలేదన్నారు. గంగవరం పోర్టు కూడా చేజారిపోయిందని, పది శాతం వాటాను రూ.600 కోట్లకు అమ్మేశారన్నారు. రాష్ట్ర సంపదను అనేక రకాలుగా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీలో టీడీపీ, జనసేన కూటమితోనే వైసీపీని గద్దె దించడం సాధ్యపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఆక్రమించి.. అమ్మేసుకుంటున్నారు..!

» ఇప్పిలివానిపాలెం జగన్న కాలనీలో అక్రమాలు

» వైసీపీ నేతల ఆగడాలు.. పట్టని యంత్రాంగం

పెందుర్తి, జనవరి 23: మండలంలోని చింతగట్ల పంచాయతీ పరిధి ఇప్పిలివానిపాలెంలో జగనన్న కాలనీలో ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. గతంలో రెవెన్యూ శాఖ సహకారంతో తొలగించిన ఆక్రమ కట్టడాలు మళ్లీ యథాస్థానంలో వెలుస్తున్నాయి. అధికార యంత్రాంగం పట్టించుకుకపోవడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఇక్కడి వైసీపీ నేతలు జగన్నకాలనీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో రెండేళ్ల కిందట జగనన్న కాలనీ కేటాయించి 130 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ లేఅవుట్‌లో సుమారు సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఈక్రమంలో ఈ లేఅవుట్ ఆనుకుని శివారునున్న సుమారు మూడెకరాల ప్రభుత్వ భూమిలో కొంతమేర వైసీపీ నేతలు ఆక్రమించి ప్లాట్లుగా విభజించినట్టు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమించిన స్థలాన్ని జగనన్న లేఅవుట్‌లోనిదేనని తెలుపుతూ రూ. లక్షల్లో విక్రయాలు కూడా చేపట్టినట్టు చెబుతున్నారు. ఈ ప్లాట్లలో ఏకంగా పక్కా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారపార్టీ నేతలు సహకరిస్తున్నారు. ఈ క్రమంలో వాస్తవ లబ్ధిదారులతోపాటు అదనంగా మరో 70మంది ప్లాట్లు ఆక్రమించి జగనన్న కాలనీలో వైసీపీ నేతల దందా చేస్తున్నట్టు స్థానిక టీడీపీ నేతలు ఆరోపిస్తూపలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆరు నెలల కిందట ఇక్కడి ఆక్రమణలను అధికారులు తొలగించారు. కొంతకాలం స్తబ్దుగా ఉంటూ, మళ్లీ ఈ స్థలంలోనే తాజాగా ఆక్రమకట్టడాలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో కొద్దిరోజుల కిందట మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత బం డారు సత్యనారాయణమూర్తి ఈ జగనన్న కాలనీలో స్థానిక వైసీపీ నేతల భూదందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ, స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులెవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. జగనన్న లేఅవుట్ సమీ పంలో ఆక్రమించిన స్థలాలను ప్లాట్లుగా విభజించి రూ. లక్షల్లో విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. గ్రావెల్ దోపిడీ జరుగుతుందన్నారు.. ఈజగన్నకాలనీలోని ఆక్రమ నిర్మాణాలపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు స్థానిక టీడీపీ నేత ఇప్పిలి చిన్నారావు చెప్పారు.

గ్రావెల్ దోపిడీ....

జగనన్న కాలనీ లే అవుట్ చదును కోసం అని చెప్పి చింతగట్లలో యథేచ్ఛగా గ్రావెల్ దోపిడీ జరుగుతోంది. ఇక్కడ గల కొండను గుల్ల చేసి అర్ధరాత్రి యంత్రాలతో అక్రమంగా మట్టిని తవ్వకాలు రజరిపి డంపర్లలో తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి. విశాఖ నగర శివార్లలో ఇటీవల స్థిరాస్తి వ్యాపారం విస్తరించడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో ఇళ్ల పునాదులు ఫిల్లింగ్ కోసం గ్రావెల్ అవసరం ఏర్పడుతోంది. దీంతో స్థానిక అధికార పార్టీ నేతలు, అక్రమార్కులు సిండికేట్‌గా మారి గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. ఈ మట్టి లోడు రూ . 5వేలు నుంచి రూ. 6వేలకు విక్రయిస్తున్నారు.



ఇప్పిలివానిపాలెంలో జగన్నకాలనీ సమీప ప్రభుత్వ స్థలంలో కట్టడాలు

కార్మిక సమస్యలు పరిష్కారం కోసమే సమ్మె



ఈ నెల 29, 30, తేదీల్లో స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహణ

తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 23: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఉక్కు కర్మాగారంలో సుమారు 11 వేల మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే మరో పదివేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. ఉద్యోగుల కొన్ని న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించాలని నాయకులు కోరుతున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేయడంతో పాటు ధర్నాలు, ఆందోళనలు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో కార్మిక సమ్మెకు దిగుతున్నారు.

ఈ క్రమంలో ఉక్కు యాజమాన్యానికి సమ్మె నోటీసును కూడా కార్మిక సంఘ నాయకులు అందజేశారు. కాగా గతంలో కూడా ఇదే మాదిరిగా రెండు రోజుల పాటు సమ్మె చేయాలని నిర్ణయించినప్పటికీ సంస్థ పరిస్థితుల దృష్ట్యా ఒకరోజు సమ్మె, మరో రోజు నిరసనకు దిగారు. మరి ఈసారి ఏం చేస్తారో వేచిచూడాలి.

ఇవీ కార్మికుల డిమాండ్లు

- 2017వ సంవత్సరం నుంచి కొత్త వేతనాలను అమలు చేయాలి
- జిందాల్‌తో చేసుకున్న ఎంవోయూను రద్దు చేసి స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి
- తక్షణమే ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలి
- నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలి
- కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి
- ఉద్యోగులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలి
- కర్మాగారంలోని ఏ ఒక్క యూనిట్‌ను ప్రైవేటీకరణ చేయరాదు
- వేతన ఎరియర్స్ అందజేయాలి
- అలవెన్స్‌లను చెల్లించాలి
- 28 శాతం ప్రోత్సాహకాలను అందించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ రెండు రోజుల సమ్మెకు దిగుతున్నారు.

ఉక్కు యాజమాన్యం స్పందించాలి



-ఎస్ఏ నాయుడు, ఉక్కు ఉద్యోగి

స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలి. ప్లాంట్ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఉద్యోగులు ముందుకు సాగుతున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్లాంట్‌ను కాపాడుకుని మరింత ప్రగతి సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలి.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో ఇంటక్ ముందంజ

ఉక్కుప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కు టౌన్‌షిప్, జనవరి 23: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సంక్షేమంతో పాటు కర్మాగార పరిరక్షణకు కృషి చేయడంలో ఇంటక్ ముందంజలో ఉంటుందని ఉక్కు ప్రధాన కార్యదర్శి మంత్రి రాజేశేఖర్ అన్నారు స్టీల్‌ప్లాంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో మంగళవారం జరిగిన ఇంటక్ ప్లాంట్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక సంక్షేమమే ధ్యేయంగా తాము ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు వైవీ రమణ, గంట్యాడ గురుమూర్తి, ఎస్ఏ నాయుడు, జి.పైడిరాజు, ఎం.ఈశ్వరరావు, తదితరులు ఈ సందర్భంగా విభాగ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అసైన్డ్ భూమిపై జిల్లా కలెక్టర్ విచారణ

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

పెందుర్తి, జనవరి 23: చినముషిడివాడ బీఆర్టీఎస్ రోడ్డులోని సప్తగిరినగర్ సమీపంలో గల సర్వే నంబర్ 122-3లో 1.80 ఎకరాల అసైన్డ్ భూమిపై జిల్లా కలెక్టర్ విచారణ జరపనున్నట్టు కలెక్టరేట్ వర్గాలు వర్గాలు తెలిపినట్టు మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. పెందుర్తిలో మంగళవారం లోకేశ్ జన్మదిన వేడుకలకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన మాట్లాడుతూ చినముషిడివాడలో రూ.కోట్ల విలువ చేసే అసైన్డ్ భూమిని పలువురు స్థానిక నాయకులు హక్కులు, క్రమబద్ధీకరణ పేరిట తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు యత్నిస్తున్నట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ స్పందించడం ముదావహమన్నారు.

'రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి గయాళ్‌గా నమోదు'

చినముషిడివాడలో సర్వే నంబర్ 123-3లో ఉన్న 2.24 ఎకరాల భూమి రెవెన్యూ రికారుల్లో గయాళ్‌గా నమోదై ఉందని కలెక్టరేట్ కార్యాలయం తరపున కె.మోహన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమి పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం ఆధీనంలో ఉందని, భవిష్యత్తు అవసరాల కోసం ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాల్సిందిగా భూ పరిరక్షణ అధికారి ఎస్‌డీసీకి ఆదేశించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో సదరు భూమిపై మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం శ్వేతపత్రం విడుదల చేయాలి: తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్

కూర్మన్నపాలెం, జనవరి 23: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం జగన్ శ్వేతపత్రం విడుదల చేశాకే ఈ నెల 27న భీమిలిలో బహిరంగ సభకు సిద్ధం కావాలని తెలుగుశక్తి అధ్యక్షడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలో మంగళవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ హిందువే కాదని, క్రిస్టియన్ అని ఆయన సోదరి షర్మిల స్పష్టం చేశారన్నారు. సొంత చెల్లికే న్యాయం చేయలేనివాడు ప్రజలకేం న్యాయం చేస్తాడని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై జగన్ స్పష్టమైన వైఖరిని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు గుమ్మడి నరేంద్ర, జ్యోతి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి

అగనంపూడి, జనవరి 23: ప్రజలందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. వార్డు పరిధిలోని బీసీ కాలనీ, కరణంవీధి, గొడ్డుపేట, ఆర్కే లేఅవుట్, మరిడిమాంబ కాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జర్వాల వచ్చినా, ఇతర అనారోగ్య సమస్యలున్నా తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన జీవీఎంసీ మలేరియా విభాగం అధికారులతో మాట్లాడి దోమల నివారణకు తక్షణమే ఫాగింగ్ చేపట్టేలా చర్యలు చేపట్టరు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొర్ర పైడిమాంబ తీర్థం



వేపగుంట, జనవరి 23: జీవీఎంసీ 94వ వార్డు పరిధి పురుషోత్తపురంలో మంగళవారం బొర్ర పైడిమాంబ తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

దుగ్గవానిపాలెంలో దానప్పతల్లి పరస

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెంలో మంగళవారం దానప్పతల్లి అమ్మవారి పరసను వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, అరటి గెలలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కాళింగుల ఆరాధ్య దైవమైన దానప్పతల్లిని వేకువజాము నుంచే దర్శించేందుకు భక్తులు బారులుతీరారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నూకాంబిక ఆలయానికి విరాళం

మల్కాపురం, జనవరి 23: గ్రేటర్ 60వ వార్డు ఇందిరాకాలనీ-2 పరిధిలో ఉన్న నూకాంబిక ఆలయానికి వైసీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ మాజీ కన్వీనర్ మూగి సూర్యనారాయణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటికే అనేకసార్లు సూర్యనారాయణ సహకారాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవి, డి.నరసింహరావు, పి.సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని ధర్నా

ఉక్కు టౌన్‌షిప్, జనవరి 23: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికులకు గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన జీతాలను ఇప్పటివరకు చెల్లించకపోవడంతో మంగళవారం ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్లాంట్ ఉపాధ్యక్షుడు వీవీ రమణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నర్సింగ్, వై.రమణమ్మ, శ్రీనివాస్, అప్పలనరస, సంతోశ్, దేవిక, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు

వేపగుంట, జనవరి 23: వేపగుంట నుంచి బీఆర్టీఎస్ రోడ్డులో ప్రమదాలను నివారించేందుకు పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. వేపగుంట నుంచి సింహాచలం వెళ్లే బీఆర్టీఎస్ కూడలిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్పన్నపాలెం, సింహపురికాలనీ, పరిసర ప్రాంతాల్లో అధిక వేగంగా వాహనాలు నడిపే వారిని స్కాన్ చేసే ఇంటర్‌సెప్టార్‌తో తనిఖీలు చేశారు. యాభై 50 కిలీమీటర్ల స్పీడ్ దాటి వాహనాలు నడిపేవారిని గుర్తించి వారినుంచి అపరాధ రుసుము వసూలు చేస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్ఐ జి.రమేశ్ తెలిపారు.

గెడ్డల్లో పూడికతీత తొలగింపు

గోపాలపట్నం, జనవరి 23: జీవీఎంసీ 89వ వార్డు పరిధి చంద్రనగర్‌లోని రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న గెడ్డల్లో పూడిక చేరి మురుగు నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి గోపి జీవీఎంసీ అధికారులకు సమస్యను విన్నవించడంతో వారు మంగళవారం పూడికతీత పనులను చేపట్టారు. కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, వార్డు శానిటరీ అధికారి కృష్ణ పూడికతీత పనులను పర్యవేక్షించారు.



అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐలా ప్రతినిధులు

అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

ఆటోనగర్, జనవరి 23: రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మంగళవారం ఐలా ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, సెక్రటరీ చీకటి సత్యనారాయణ, తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మిందిలోని మంత్రి ఇంటికి వారు వెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, వాసీవా మాజీ అధ్యక్షుడు ఏకే బాలాజీ, ఎల్.బాపిరాజు, రమాకాంత్, ప్రసాద్, నరేన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, జనవరి 23: ఇక్కడి బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో పలు ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా సుసర్ల కాలనీ, ఎన్ఏడీ ఎస్సీ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, గాంధీనగర్, రెడ్డివీధి, గవరవీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి రత్నగిరినగర్ 11కేవీ ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా రత్నగిరినగర్, లక్ష్మీనగర్, కిశోర్‌లేఅవుట్, 80 ఫీట్ రోడ్, పీఎఫ్ కాలనీ, చాణక్యనగర్, చినముషిడివాడ మెయిన్ రోడ్డు, అగ్రికల్చర్ కళాశాల ఏరియా, ఎన్ఏడీ లేఅవుట్, సాయిసాధానగర్, గొల్లవిల్లిపాలెం, పాపయ్యరాజుపాలెం, భవానీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయన్ని ప్రజలు గమనించాలని కోరారు.

కణితి పీహెచ్‌సీకి వితరణ

కూర్మన్నపాలెం, జనవరి 23: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కె.రామరాజు ఆర్థిక సాయంతో సమకూర్చిన పలు కుర్చీలు, ఏసీలు, వీల్ ఛైర్లను మంగళవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అందజేశారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధుడు సుభాశ్ చంద్రబోష్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 21, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38, బీరకాయలు 46, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 22, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబాటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 24 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..



వడ్లపూడిలో కేక్ కట్ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, బొండా జగన్



పెందుర్తిలో రోగులకు మందులు అందజేస్తున్న శ్రీభరత్, 'బండారు'

పాదయాత్రతో కార్యకర్తల్లో జోష్‌ను పెంచిన లోకేశ్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పలుచోట్ల ఘనంగా పుట్టినరోజు సంబరాలు

కూర్మన్నపాలెం, జనవరి 23: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తన పాదయాత్రతో కార్యకర్తల్లో జోష్‌ను పెంచారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో మంగళవారం లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌లు నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లా శ్రీనువాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని ప్రజలే చెబుతున్నారన్నారు. బొండా జగన్ మాట్లాడుతూ లోకేశ్ ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులను అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, బెల్లంకొండ రాజన్ రాజు, కె.శ్రీనివాసవర్మ, వి.రాంబాబు, డీవీ అప్పారావు, అశోక్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు జిమ్‌సర్ గీతం కళాశాల ఆధ్వర్యంలో 97వ వార్డు పరిధి పులగాలిపాలెంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గీతం విద్యాసంస్థల అధినేత, టీడీపీ నేత ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. సుమారు 550 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం శ్రీభరత్ కేక్ కట్ చేసి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి తినిపించారు. టీడీపీ నాయకుడు అవగడ్డ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఇక్కడి లయోలా వృద్ధాశ్రమంలో వారికి శ్రీభరత్, బండారు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్రావు, నాయకులు కరక దేవుడు, వేగి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

అగనంపూడి: టీడీపీ నేత లోకేశ్ పేరిట పెదమడక సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను పార్టీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశంద్ర ఆధ్వర్యంలో జరిపించారు. లోకేశ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగుండాలని ప్రార్థించారు. అనంతరం కేక్ కట్ చేశారు. నాయకులు జి.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎస్.బాబ్జీ, రాజు, రమేశ్, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఇక్కడి జింక్ వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు నారా లోకేశ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ టీడీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

పెదగంట్యాడ: టీడీపీ మండల కార్యాలయంలో లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు శ్రీముసిరి శ్రీనివాసరావు, పి.సోమునాయుడు, ఎం.పెంటయ్య, ఎం.రమణ, ఎం.అప్పారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్

'గాజువాక'లో మందకొడిగా సాగుతున్న కుల గణన

గాజువాక, జనవరి 23: గాజువాక నియోజకవర్గంలో సచివాలయ సిబ్బంది కుల గణన చేపడుతున్నారు. ఈ నెల 19 నుంచి కుల గణన ప్రారంభించినప్పటికీ సర్వర్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్య కారణంగా మందకొడిగా సాగుతోంది. ఇప్పటివరకు మూడువేల పైచిలుకు ఇళ్లల్లో సర్వే జరిపినట్టు సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇళ్లకు వెళుతున్న సిబ్బంది కుటుంబ వివరాలతో పాటు ఇతర సమాచారాన్ని, కులం గురించి తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. అయితే కొంతమంది సమాచారం చెప్పేందుకు నిరాకరిస్తుండడం సిబ్బందికి ఇబ్బందిగా మారుతోంది. ఇదిలా ఉండగా కుల గణన వివరాలను పొందుపరుస్తున్న సమయంలో సర్వర్ డౌన్ అవుతుండడంతో ఆ యాప్ ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు సిబ్బంది చెబుతున్నారు. సర్వర్ సమస్య వల్ల ఒకే ఇంటి వద్ద అధిక సమయం వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సర్వే మందకొడిగా సాగుతోంది. సచివాలయ సిబ్బందితో పాటు క్లస్టర్ల వారీగా వలంటీర్లు కూడా కుల గణన వివరాల సేకరణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఈ నెల 28వ తేదీలోగా కుల గణన పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ గాజువాక నియోజకవర్గంలో రెండు లక్షలకు పైగా కుటుంబాలు ఉండడంతో సర్వే పూర్తి చేసేందుకు మరింత ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.



కుల గణన వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

నేతాజీ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలి

సుభాశ్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు సూచించారు. గాజువాకలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి స్ఫూర్తి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో శ్రీచైతన్య, నారాయణ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి మాట్లాడుతూ నేతాజీ గొప్ప దేశ భక్తుడని, స్వాతంత్ర్య సమరంలో ఆయన ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నితిన్, సత్యారావు, రాకేశ్, వెంకటేశ్, సిద్ధు, అవినాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీపేట (కంచరపాలెం): నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతి సందర్భంగా టీడీపీ 56వ వార్డు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు కంచరపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దనున్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. చిన్నారులకు స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రాజు రెడ్డి, పల్లా ధర్మారావు, ఆదినారాయణ, రంజిత్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: నేతాజీ సుభాశ్ చంద్రబోస్ యువతకు స్ఫూర్తి ప్రదాత అని, ధైర్య సాహసాలకు ఆయన పెట్టింది పేరు అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, తదితరులు పాల్గొన్నారు.


అగనంపూడి: ఇక్కడి సత్రం జంక్షన్‌లోని మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్లోబల్ అవేర్‌నెస్ అసోసియేషన్ చైర్మన్ మోటూరి వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు, విందులు నారాయణరావు, ముత్యాల అప్పారావు, కరణం శ్రీను, సతీశ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: టీడీపీ మండల కార్యాలయంలో సుభాశ్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ పాత్ర ప్రముఖమైనదన్నారు. టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గోక్యాడ ముత్యాలు, ఎం.పెంటయ్య, ఎ.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఏబీవీపీ చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

68వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన




శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 23: కాలనీలలో అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించినప్పుడే అవి ఇతర కాలనీలకు ఆదర్శవంతంగా నిలుస్తాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో 68వ వార్డు పరిధి మింది ఎస్సీ కాలనీలోని రహదారుల నిర్మాణంతో పాటు, అక్కిరెడ్డిపాలెం నుంచి షీలానగర్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, వరదాడ రమణ, ఈటి సురేష్, ఆర్.చిట్టిబాబు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

31 కిలోల గంజాయి స్వాధీనం

పెందుర్తి, జనవరి 23: పెందుర్తిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో అనంతగిరి నుంచి విశాఖకు తీసుకువస్తున్న 31 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మరిడాన శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో వివిధ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆరుగురిని అరెస్టు చేశామన్నారు.

'పెందుర్తి' ఓటర్లు 2,99,103 మంది..



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేష శైలజ

పెందుర్తి, జనవరి 23: పెందుర్తి నియోజకవర్గానికి చెంది తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. నియోజవర్గ పరిధిలోని 282 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం ఓటర్లు 2,99.103 ఉండగా.. వీరిలో పురుషులు 1,48,576 మంది, మహిళలు 1,50,522 మంది, ట్రాన్స్‌జెండర్స్ ఐదుగురు, సర్వీస్ ఓటర్లు 473 ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి మండలంలో 1,65,441 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 82,576 మంది, మహిళలు 82,863 మంది, టాన్స్‌జెండర్స్ ఇద్దరు ఉన్నారు. సబ్బవరం మండలంలో 58,767 మంది ఓటర్లకు గాను పురుషులు 28,786 మంది, మహిళలు 29,980 మంది, టాన్స్‌జెండర్స్ ఒకరు ఉన్నారు. పరవాడ మండలంలో 63,474 మంది ఓటర్లకు గాను పురుషులు 31,427 మంది, మహిళలు 32,045 మంది, టాన్స్‌జెండర్స్ ఇద్దరు ఉన్నారు. పెదగంట్యాడ మండలంలో 11,421 మంది ఓటర్లకు గాను పురుషులు 5,787 మంది, మహిళలు 5,634 మంది ఉన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అన్ని రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజ హాజరై నియోజకవర్గ తుది జాబితా వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నారు. కాగా నియోజవర్గం మొత్తం ఓట్లల్లో సగానికి పైగా ఓట్లు పెందుర్తి మండలంలోనే ఉండడం గమనార్హం.

టాలెంట్ సెర్చ్‌లో కేవీ విద్యార్థికి 53వ ర్యాంక్



నగదు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, జనవరి 23: సింగపూర్‌కు చెందిన సముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెరిటైమ్ స్టడీస్, లోనవల ఎగ్జిక్యూటివ్ షిప్‌మేనేజ్‌మెంట్ నిర్వహించిన ఆలిండియా టాలెంట్ సెర్చ్ పరీక్షలో తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరు విద్యార్థి ప్రియంగ్షు ఘోష్‌కు 53వ ర్యాంక్ లభించింది. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం ఆ విద్యార్థికి కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ రూ.1000 బహుమతి, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష పే చర్చ, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు.

'వేతన సవరణ అమలు చేయాలి'

డాబాగార్డెన్స్, జనవరి 23: వేతన సవరణ వెంటనే అమలు చేయాలని బీఎస్‌ఎన్‌ఎల్ జాయింట్ ఫోరం ఆఫ్ నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్స్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే వేజ్ రివిజన్ చేయాలన్నారు. 4జీ, 5జీ అమలుకు ఎటువంటి ఆటంకాలు సృష్టించవద్దని తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులకు కొత్త ప్రమోషన్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ అసోసియేషన్ కన్వీనర్ సాగర్, చైర్మన్ రామాంజనేయులు, అష్రఫ్, లచ్చిరాజు, ఉమాదేవి, రాధ, ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

కంచరపాలెం, జనవరి 23 : కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రాంగణంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 25వ తేదీ గురువారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సబ్‌రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఈమేళాలో ఆప్టెక్ కన్సల్టెంట్స్, ఫ్యూచర్ మేన్ పవర్ కంపెనీలు పాల్గొని యువతకు ఎంపికలు నిర్వహించనున్నాయి. నర్సింగ్ స్టాఫ్, హోం కేర్ టేకర్ ఉద్యోగాలకు ఇంటర్ బైపీసీ, ఎఎన్‌ఎం, జీఎన్‌ఎం, జీడీఏ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వారితో ఆపరేటర్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఆసక్తి, అర్హత గల యువత ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేయాలని శ్యామ్ సుందర్ నిట్టల కోరారు. ఆ రోజు ఉదయం 9గంటలకు అన్నీ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

53వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మర్రిపాలెం, జనవరి 23: గ్రేటర్ 53వ వార్డు మర్రిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్తర నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కేకే రాజు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అర్హులు పొందుతున్న లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో సమస్యను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తో కలసిరావాలి'

డాబాగార్డెన్స్, జనవరి 23: తూర్పు నియోజకవర్గంలో ఉన్న కాపులంతా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసిరావాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి కోరారు. చిన్ననాటినుంచి సమాజంలో మార్పుతేవాలనే ఆలోచనతోపాటు చదువుకుంటే సమాజానికి ఏదైనా చేయవచ్చుననే భావనంతో పెరిగానన్నారు. విద్యావంతురాలిగా ఇప్పుడు సమాజాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాజకీయాలతోనే మార్పు సాధ్యమని భావించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. కాపు సామాజికవర్గం అన్ని విధాలా తనకు అండగా ఉంటుందని ఆశిస్తున్నానన్నారు. గతంలో హనుమంతువాక కొండవాలు ప్రాంత సమస్యలను గుర్తించి పోరాడానన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి..

సీతమ్మధార, జనవరి 23: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార ఎస్ఆర్ నగర్, వోల్వో ఆఫీస్, క్షత్రియ కళ్యాణ మండపం, అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రాంతం, రాకెట్ పార్క్ ప్రాంతం, హిల్ వ్యూ పార్క్, అభయాంజనేయ స్వామి ఆలయం, బీజేపీ ఆఫీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రాంతం, సాయిబాబా టెంపుల్, ఎస్ఆర్ఐ ఆసుపత్రి వెనుక తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విశాఖపట్నం, జనవరి 23: రైల్వే స్టేషన్‌లోని ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతని వయస్సు55 నుంచి 60 ఏళ్లు, ఎత్తు 5.9 అంగుళాలు ఉండవచ్చుని, నీలి రంగు షర్టు ధరించినట్టు వారు తెలిపారు., అనారోగ్యంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసినవారు విశాఖ జీర్పీ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీహెచ్.ధనుంజయనాయుడు ఫోన్: 94406 27547, ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఫోన్: 98664 13487లకు సమాచారం అందించాలి.



ఆశ్రమంలో అంధ విద్యార్థులకు అన్నదానం



లోకేశ్ బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న ఉత్తర నియోజకవర్గ టీడీపీ నాయకులు

టీడీపీ గెలుపే ధ్యేయం కావాలి

- యువనేత లోకేశ్ జన్మదిన వేడుకల్లో నాయకుల పిలుపు

అక్కయ్యపాలెం, జనవరి 23 : రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విజయ్‌బాబు కేక్ కట్ చేసి పంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ ప్రజల కష్టాలు తెలుసుకొనేందుకు యువగళం పేరిట పాదయాత్ర నిర్వహించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈతలపాక సుజాత, బొడ్డేటి మోహన్, వాసుపల్లి రాజు, పొ లమరశెట్టి శ్రీనివాస్, మొల్లేటి కుమారస్వామి, యాగాటి ఆదిలక్ష్మి, గొలగాని సౌజన్య, సనపల కీర్తి తదితరులు పాల్గొన్నారు. విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో 44వ వార్డులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, కృష్ణ, నిర్మల, పుష్ప, మోహనరావు, పందిరిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. విశాఖపార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్, 42వ వార్డు టీడీపీ అధ్య క్షుడు కన్నం వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనపాల కృష్ణ, శ్రీకృష్ణ, పిలక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు భోజన వసతి

మహారాణిపేట: నారా లోకేష్ జన్మదినోత్సవం సందర్భంగా బధిర విద్యార్థులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నదానం చేశారు. మంగమారిపేటలో చిన్న జియ్యర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారిజా ఆశ్రమ విద్యాలయంలో అంధులు, బధిర చిన్నారులకు భోజనంతోపాటు స్వీట్లను అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ పుట్టిన రోజు టీడీపీ పండగరోజులాంటిదన్నారు. ఆయనరాజకీయాల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

వాల్తేరు డివిజన్ అభివృద్ధిలో సిబ్బంది కృషి భేష్

- డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్



విశిష్ట రైల్ పురస్కార గ్రహీతలను సత్కరించిన డీఆర్ఎం

విశాఖపట్నం, జనవరి 23: వాల్తేర్ డివిజన్ అభివృద్ధి పథంలో నడిపించడంలో సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ కొనియాడారు. ఇటీవల విశిష్ట రైల్ పురస్కార్ అవార్డులందుకున్న వాల్తేరు డివిజన్ పరిధిలోని ఉద్యోగులను మంగళవారం తన కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ రైల్వేలో వాల్తేరు డివిజన్‌ను మరింత అత్యున్నత స్థాయికి చేర్చేందుకు చిత్తశుద్ధితో సేవలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం అవార్డు గ్రహీతలతో నేరుగా మాట్లాడి వారిని ప్రశంసించారు. కాగా, కేకే లైనులోని మన్‌బాత్- జరాతీ సెక్షన్ మధ్య గత సెప్టెంబరులో కొండచరియలు విరిగిపడి సమయంలో త్వరితగతిన పనులను చేపట్టి ట్రాక్‌ను పునరుద్ధరించిన డివిజన్ బృందాలను ప్రత్యేక సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీ ర్‌కుమార్ గుప్తా పాల్గొన్నారు.

తైక్వాండోలో ఆంధ్రాకు ఓవరాల్ చాంప్ ట్రోఫీలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 23: జాతీయ సీనియర్, జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్రా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని సవాయి మాదాపూర్‌లో జరిగిన ఈ టోర్నీలో సీనియర్ కేటగిరి పూంసే ఈవెంట్‌లో ఆంధ్రా క్రీడాకారులు ఆరు స్వర్ణ, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలతో ఓవరాల్ చాంపియన్స్‌గా నిలవగా, జూనియర్ కేటగిరిలో ఆరు స్వర్ణ, ఐదు రజత, ఐదు కాంస్య పతకాలతో ఓవరాల్‌గా ద్వితీయ స్థానాన్ని సాధించారు.పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్‌లను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.అచ్యుతరెడ్డి, సి.వేణుగోపాలరావు, అభినందించారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది హవా!

... 3వ పేజీ తరువాయి

నకిలీ పత్రాలతో బ్యాంకులో ఒక ఖాతా తెరిచాడు. కాంట్రాక్టర్లు ఈఎండీగా చెల్లించే మొత్తాన్ని ఆ ఖాతాకు జమ చేయడం మొదలెట్టాడు. ఇలా నాలుగైదేళ్లపాటు రూ.50 కోట్ల వరకూ దారి మళ్లించేశాడు. విషయం బయటపడడంతో పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే కేసు లేకుండా చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు శతవిధాలా ప్రయత్నించినట్టు సమాచారం. తాజాగా ఈ విభాగంలోనే ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వద్ద పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులు అలాంటిదేమీ లేదని, పుకార్లేనని కొట్టి పారేస్తున్నప్పటికీ...భారీ కుంభకోణమే జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత

- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు

సీతంపేట, జనవరి 23: జాతికి స్ఫూర్తి ప్రదాత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ అని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేడ్కర్ సామాజిక న్యాయమహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం పేరిట రామాటాకీస్ రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఇంటింటి రాజ్యాంగం, అండమాన్‌కు చెందిన బతుకుల అప్పారావు సమర్పించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. యూపీఎస్సీ మెంబర్, ద్రవిడ యూనివర్శిటీ విశ్రాంత చాన్సలర్ ఆచార్య కేఎస్ చలం, ఏయూ ఆంత్రోపాలజీ హెచ్ఓడీ ఆచార్య సత్యపాల్, పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ వీరాజు అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరించారు. వివిధ విభాగాల ప్రతినిధులు వి.మధుసూదనరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, కె.రామారావు, ఆర్.పూర్ణిమాదేవి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్ ఏర్పాటుకు సహకరించాలి

- యూనియన్ అధ్యక్షులు ఖాజావల్లి



ఆటోనగర్‌కు సంబంధించిన నమూనా చూపుతున్న ఖాజావల్లి

డాబాగార్డెన్స్, జనవరి 23: వేలాది మంది కార్మికుల ప్రయోజనార్థం ఆనందపురం కనమాం లో రాజన్న ఆటోనగర్ నిర్మాణానికి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా సహకరించాలని రాజన్న ఆటోనగర్ యూనియన్ అధ్యక్షులు ఖాజావల్లి విజ్ఞప్తి చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోమొబైల్ రంగంపై ఆధారపడి ఆనందపురం, తరగపువలస నుంచి టౌన్ కొత్తరోడ్డు, పెందుర్తి నుంచి ఎంవీపీ కాలనీ వరకు విస్తరించి ఉన్నారన్నారు. ఈ రంగంలో 10 వేల మంది ఆటోమొబైల్ మెకానిక్ ఓనర్స్, వర్కర్లు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా నగర పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలందరూ ఆటోనగర్ శంకుస్థాపనకు సహకరించాలని కోరారు. యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఆటోనగర్ భూములకు సంబంధించి రైతులకు చెక్కులిచ్చిన సమయంలో పదిరోజుల్లో పరిహారం చెల్లిస్తామని ప్రకటించి ఇప్పటికి ఆరునెలలు గడిచిందన్నారు. ఈస్థితిలో వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి చొరవ తీసుకుని చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ఆటోనగర్ పూర్తికి ఆయన సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేతాజీ త్యాగం మరువలేం

కంచరపాలెం, జనవరి 23: స్వాతంత్ర సమర యోధుడు సుభాష్ చం ద్రబోస్ త్యాగం మరువలేనిదని ఉత్తర జనసేన నాయకులు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఉత్తర జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొనికంచరపాలెం ఫ్లైఓవర్ వద్ద గల నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. సొంత సైన్యం ఏర్పాటుచేసుకుని బ్రిటీష్ పాలకులకు బోస్ వణికించారన్నారు. యువత నేతాజీ చూపించిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు ముమ్మిన నాగమణి, అడబాల నాగమణి,దుర్గా రెడ్డి, గౌరీ, మోషేస్ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు వేడుకలు

జయంతిని పురస్కరించుకుని నేతాజీ విగ్రహానికి వైసీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సతీష్, శశికళ, కె.పి.రత్నాకర్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

మురళీనగర్, జనవరి 23 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి అధ్యక్షతన క్లబ్ పూర్వ సభ్యులు బుచ్చయ్య చౌదరి, ఆర్.సత్యనాథం తదితరులు బోస్ చిత్రానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు, అతిథులు, వాకర్స్ ప్రతినిధులు సుభాష్ చంద్రబోస్ గొప్పదనంపై మాట్లాడారు. ఆయనను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

సంపులో పడి బాలుడి దుర్మరణం

- కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు
- దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంఘటన

కూర్మన్నపాలెం, జనవరి 23: మురుగు నీటిని శుద్ధిచేసే ప్లాంట్ సంపులో జారిపడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

జీవీఎంసీ 86వ వార్డు రాసాలమ్మ కాలనీకి లక్కరాజు ఉదయ్‌చంద్, శోభ దంపతుల కుమారుడు రాకేష్ రోషన్ (8) ఉన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత స్నేహితుడు సందీప్‌తో కలసి కుక్క పిల్లలతో ఆడుకునేందుకు యాతపాలెం వెనుక ఉన్న మురుగునీటి శుద్ధి కర్మాగారానికి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తరువాత బిస్కెట్లు తీసుకురమ్మని సందీప్‌ను ఇంటికి పంపించి రాకేష్ అక్కడే ఉండిపోయాడు. కుక్కపిల్లలతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సంపులో పడిపోయాడు. ఈ సమయంలో ఆ సమీపంలో ఎవరూ లేకపోవడంతో సంపులోని నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. బయటకు వెళ్లిన కుమారుడు ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం ఉదయం సంపులో బాలుడి మృతదేహం తేలడాన్ని స్థానికులు చూశారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని వెలికితీశారు. రోషన్ తల్లిదండ్రులకు తెలియపరచడంతో వారు వచ్చి గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా?

నీటి విభాగం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగునీటి శుద్ధి కర్మాగారానికి గేట్లు లేకపోవడంతో చిన్నపిల్లలు అక్కడ ఆడుకోవడానికి వెళ్తున్నారని, ఈక్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. చిన్నపిల్లలు ఆ ప్రాంతానికి వస్తే గుర్తించి, వారించాల్సిన సిబ్బంది అసలు విధుల్లో ఉన్నారో లేరో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే జోన్‌పై రాజకీయం

... 3వ పేజీ తరువాయి

చెబుతున్నాయి. అంతేకాకుండా కొత్తగా ఆ భూముల్లో 20 ఎకరాల్లో నీటి వనరులు ఉన్నాయని చెబుతున్నారని కూడా ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఈ లేఖ అందిన తరువాత అక్కడికి వెళ్లి పరిశీలిస్తే ఆక్రమణదారులు అలాగే ఉన్నారని, నీటి వనరులు ప్రస్తుతానికి ఏమీ లేవని, వర్షాలు పడితే నీరు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. 52 ఎకరాల్లో 20 ఎకరాలు నీటి వనరులైతే...32 ఎకరాలనే ఉపయోగించుకోవలసి ఉంటుందని, అవి కూడా ఆక్రమణలు తొలగించాకే ఇవ్వాల్సి ఉంటుందని అంటున్నారు. లేఖ రాస్తే భూములు అప్పగించినట్టు ఎలా అవుతుందని, వాటికి సంబంధించిన పత్రాలు ఇవ్వాలని, అటువంటిదేమీ ఇప్పటివరకు జరగలేదని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

ఎన్నికల ముందు శంకుస్థాపనకు బీజేపీ నేతల పట్టు

గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయని, జోన్ ఏర్పాటుకు రూ.106 కోట్లు కేటాయించినా, పనులు ప్రారంభించకపోవడంపై సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ఉత్తరాంధ్ర బీజేపీ నాయకులు ఢిల్లీలో మొర పెట్టుకుంటున్నారు. జోన్ కార్యాలయాల శంకుస్థాపనకు ఏదో ఒక తేదీ ప్రకటించాలని కేంద్ర నేతలను కోరుతున్నారు. అందుబాటులో ఉన్న భూముల్లోనే ఎక్కడో ఓ చోట శంకుస్థాపన చేస్తే కొంత వరకు ప్రజలకు సమాధానం చెప్పుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నట్టుగా సమాచారం.

కొణతాల మాటలకు కౌంటర్‌గా ఎంపీ సత్యవతి ప్రకటన

మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం అనకాపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో రైల్వే జోన్ హామీ నిలుపుకోలేదని విమర్శించారు. దీనికి కౌంటర్‌గా అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి సోమవారం అక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి, ఫిబ్రవరిలోనే రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరుగుతుందని ప్రకటించారు. అది రాజకీయ విమర్శలను తిప్పికొట్టడానికి చేసిన ప్రకటనే తప్ప అందులో వాస్తవం లేదని, దానిపై ఇంత వరకు తమకు ఎటువంటి సమాచారం లేదని రైల్వే వర్గాలు స్పష్టంచేశాయి.

నోరు మెదపని విశాఖ నాయకులు

విశాఖపట్నంలో రైల్వే జోన్‌పై వైసీపీకి చెందిన నాయకులు గానీ, బీజేపీలో హడావుడి చేస్తున్న నాయకులు గానీ ఇప్పుడు ఏమీ మాట్లాడడం లేదు. వైసీపీ నాయకులైతే అది తమకు సంబంధించిన విషయం కాదన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు. జోన్ పనుల ప్రారంభంపై ఇక్కడ ఏ నాయకుడికీ స్పష్టమైన సమాచారం లేకపోవడం గమనార్హం.

'సౌత్'లో వైసీపీకి ఎదురుగాలి

... 3వ పేజీ తరువాయి

గుప్పించారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించి ఆ నలుగురు కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీనివల్ల మిగిలిన కార్పొరేటర్లు వాసుపల్లికి వ్యతిరేకంగా మాట్లాడరని పార్టీ పెద్దలు భావించినప్పటికీ మరో ముగ్గురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడిపోవాలనే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల 19న ఎమ్మెల్యే వాసుపల్లి తన కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశానికి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఒక్కరే హాజరయ్యారు. 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, టీడీపీ నుంచి గెలిచి తర్వాత వైసీపీకి మద్దతుగా నిలిచిన 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండలు గైర్హాజరయ్యారు. వాసుపల్లిపై కార్పొరేటర్లలో ఉన్న వ్యతిరేకతకు అంతకంటే నిదర్శనం ఏం కావాలని ఆయన వ్యతిరేక వర్గం ప్రచారం ప్రారంభించింది.

మరోవైపు వాసుపల్లికి సొంత సామాజికవర్గంలో కూడా మద్దతు కరువైంది. ఆయనకు టికెట్టు ఇవ్వొద్దని, ఒకవేళ ఇచ్చినా తాము సహకరించబోమంటూ ఆ మధ్య మత్స్యకార సంఘ నేతలు బహిరంగంగానే ప్రకటించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోందని, అధిష్ఠానం కూడా నివారణ చర్యలపై దృష్టిసారించకుండా మొండిగా ముందుకువెళుతోందంటూ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మాజీ మంత్రి కొణతాలతో షర్మిల భేటీ

... 3వ పేజీ తరువాయి

షర్మిలను కలిసి చాలా కాలమైందని, అందుకే ఇంటికి వచ్చారన్నారు. రాజశేఖర్‌రెడ్డితో తాను కలిసి పనిచేశానని, ఇది కేవలం వ్యక్తిగత పర్యటన మాత్రమేనని స్పష్టంచేశారు. రాజకీయాలతో ముడి పెట్టవద్దని కోరారు. మేనమామ ఇంటికి మేనకోడలు వచ్చినట్టు షర్మిల వచ్చారని స్పష్టం చేశారు. తాను జనసేనలో చేరుతున్నట్టు ఇదివరకే స్పష్టంగా చెప్పానని, రాష్ట్ర భవిష్యత్తు తనకు ముఖ్యమన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఆకాంక్షలను జగన్ నెరవేర్చలేకపోయారన్నారు. స్టీల్‌ప్లాంటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిందని, కానీ అది కూడా జరగలేదన్నారు. గంగవరం పోర్టు కూడా చేజారిపోయిందని, పది శాతం వాటాను రూ.600 కోట్లకు అమ్మేశారన్నారు. రాష్ట్ర సంపదను అనేక రకాలుగా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీలో టీడీపీ, జనసేన కూటమితోనే వైసీపీని గద్దె దించడం సాధ్యపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఆక్రమించి.. అమ్మేసుకుంటున్నారు..!

- ఇప్పినివానిపాలెం జగన్న కాలనీలో అక్రమాలు
- వైసీపీ నేతల ఆగడాలు.. పట్టని యంత్రాంగం

పెందుర్తి, జనవరి 23: మండలంలోని చింతగట్ల పంచాయతీ పరిధి ఇప్పిలివానిపాలెంలో జగనన్న కాలనీలో ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. గతంలో రెవెన్యూ శాఖ సహకారంతో తొలగించిన అక్రమ కట్టడాలు మళ్లీ యథాస్థానంలో వెలుస్తున్నాయి. అధికార యంత్రాంగం పట్టించుకుకపోవడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఇక్కడి వైసీపీ నేతలు జగన్నకాలనీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో రెండేళ్ల కిందట జగనన్న కాలనీ కేటాయించి 130 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ లేఅవుట్‌లో సుమారు సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఈక్రమంలో ఈ లేఅవుట్ ఆనుకుని శివారునున్న సుమారు మూడెకరాల ప్రభుత్వ భూమిలో కొంతమేర వైసీపీ నేతలు ఆక్రమించి ప్లాట్లుగా విభజించినట్టు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమించిన స్థలాన్ని జగనన్న లేఅవుట్‌లోనిదేనని తెలుపుతూ రూ. లక్షల్లో విక్రయాలు కూడా చేపట్టినట్టు చెబుతున్నారు. ఈ ప్లాట్లలో ఏకంగా పక్కా నిర్మాణాలు చేపట్టేందుకు అధికారపార్టీ నేతలు సహకరిస్తున్నారు. ఈ క్రమంలో వాస్తవ లబ్ధిదారులతోపాటు అదనంగా మరో 70మంది ప్లాట్లు ఆక్రమించి జగనన్న కాలనీలో వైసీపీ నేతల దందా చేస్తున్నట్టు స్థానిక టీడీపీ నేతలు ఆరోపిస్తూపలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆరు నెలల కిందట ఇక్కడి ఆక్రమణలను అధికారులు తొలగించారు. కొంతకాలం స్తబ్దుగా ఉంటూ, మళ్లీ ఈ స్థలంలోనే తాజాగా ఆక్రమకట్టడాలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో కొద్దిరోజుల కిందిట మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత బం డారు సత్యనారాయణమూర్తి ఈ జగనన్న కాలనీలో స్థానిక వైసీపీ నేతల భూదందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ, స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులెవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. జగనన్న లేఅవుట్ సమీ పంలో ఆక్రమించిన స్థలాలను ప్లాట్లుగా విభజించి రూ. లక్షల్లో విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. గ్రావెల్ దోపిడీ జరుగుతుందన్నారు.. ఈజగన్నకాలనీలోని అక్రమ నిర్మాణాలపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు స్థానిక టీడీపీ నేత ఇప్పిలి చిన్నారావు చెప్పారు.

గ్రావెల్ దోపిడీ....

జగనన్న కాలనీ లే అవుట్ చదును కోసం అని చెప్పి చింతగట్లలో యధేచ్ఛగా గ్రావెల్ దోపిడీ జరుగుతోంది. ఇక్కడ గల కొండను గుల్ల చేసి అర్ధరాత్రి యంత్రాలతో అక్రమంగా మట్టిని తవ్వకాలు రజరిపి డంపర్లలో తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి. విశాఖ నగర శివార్లలో ఇటీవల స్థిరాస్తి వ్యాపారం విస్తరించడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో ఇళ్ల పునాదులు ఫిల్లింగ్ కోసం గ్రావెల్ అవసరం ఏర్పడుతోంది. దీంతో స్థానిక అధికార పార్టీ నేతలు, అక్రమార్కులు సిండికేట్‌గా మారి గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. ఈ మట్టి లోడు రూ . 5వేలు నుంచి రూ. 6వేలకు విక్రయిస్తున్నారు.



ఇప్పిలివానిపాలెంలో జగన్నకాలనీ సమీపప్రభుత్వ స్థలంలో కట్టడాలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జనవరి 23: విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందరనగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

మద్దిలపాలెం పరిధిలో...

మద్దిలపాలెం: డాక్టర్స్ కాలనీ, నక్కవానిపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార, అల్లూరి విగ్రహం, బాలయేసు చర్చి, డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీకాలనీ, అంబేద్కర్‌నగర్, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, జయభేరి, క్రాంతినగర్, నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు, శారద స్కూల్, కేఆర్ఎంకాలనీ, ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఎంవీపీ కాలనీ, జనవరి 23: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులతోపాటు పాఠశాలల యాజమాన్యాలూ శ్రద్ధ చూపాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. రెయిన్‌బో ఆస్పత్రి, వాసన్ ఐ కేర్, కిడ్స్ డెంటల్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్యులు పీఏపీ లక్ష్మణసాయి, రాధికా గౌతమ్, ప్రసాద్ వైద్య పరీక్షలు చేశారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం

సింహాచలం, జనవరి 23: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు, షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు కావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

భీమునిపట్నం (రూరల్) జనవరి 23: ఇటీవలి తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు డి.అప్పలనరసింహరాజు డిమాండ్ చేశారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని మదుపు పెట్టారన్నారు. తుఫాన్‌కు నేలపాలైన ఎకరా వరికి ప్రభుత్వం ఇస్తున్న పరిహారం రూ6,400 ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వీసీకి ఏఏఏ చైర్మన్ అభినందనలు

వెంకోజీపాలెం, జనవరి 23: ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం (ఏఏఏ) చైర్మన్ డాక్టర్ ఐ.శంకరరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ ఉపకులపతిగా రెండో సారి బాధ్యతలు స్వీకరించడం పట్ల ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

భీమునిపట్నం, జనవరి 23: జాతీయ నెట్‌బాల్ పోటీలలో పాల్గొనడానికి వెళుతున్న ది సన్ స్కూల్ విద్యార్థులు ఎన్.హారిక, జి.నిఖిత, జి.శ్రీరామ్‌లకు రూ.5వేలు చొప్పున స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మధ్యప్రదేశ్ జవహర్ లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 36వ జూనియరు నేషనల్ నెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు పాఠశాల నుంచి ఎంపికైన ముగ్గురు విద్యార్థులను మంగళవారం ఆ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందిస్తూ, ఆర్థిక సహాయాన్ని అందించారు. నైపుణ్యతను ప్రదర్శించి విజేతలుగా నిలవడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 21, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 38, బీరకాయలు 46, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 24, దొండకాయలు 22, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబాటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 24 , కంద 54, దేముడు చిక్కుడు 30, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..

ముందుకు సాగని ఆధునికీకరణ పనులు

- అభివృద్ధికి నోచని రేవిడి యానాద్రి చెరువు
- నాలుగేళ్లు దాటినా పక్కడిపనులక్కడే
- 140 ఎకరాలకు సాగునీరివ్వాలని లక్ష్యం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు


యానాద్రి చెరువులో చేపల పెంపకం కోసం రూపొందించిన అంతర్గత చెరువు

పద్మనాభం, జనవరి 23: మండలంలోని రేవిడి యానాద్రి చెరువు ఆధునికీకరణ- పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టి నాలుగేళ్లయినా ఎక్కడే వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. ఈ చెరువు అభివృద్ధి కోసం ఆర్భాటంగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించినా రైతులకు కొద్దిపాటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మినహా పనులు చేపట్టలేదు. సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం కింద చెరువు ఆయకట్టు శివారుకు సాగునీరు అందించాలన్న లక్ష్యం మేరకు ప్రభుత్వం నిధులు మంజూరుకు హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా రేవిడి యానాద్రి చెరువును ఎంపిక చేశారు. చెరుకు దిగువన ఉన్న 140 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, వారికి వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయడం, పాడి పశువులు, కోళ్ళు, కూరగాయల పెంపకం వంటి అదనపు ఆదాయవనరులపై అవగాహన కల్పించేలా ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో పథకం అమలుకు గ్రామాన్ని ఎంపిక చేశారు. దీనిలో భాగంగా 2020 జూన్‌లో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిలా ఫలకం ఆవిష్కరించారు. ఈ పనుల కోసం రూ.133.70లక్షలతో అంచనాలు రూపొందించారు. యానాద్రి చెరువు విస్తీర్ణంలో మరో చెరువును రూపొందించారు. దీనిలో చేపల పెంపకం ప్రోత్సహించాల భావించారు. ఈ చెరువు రూపకల్పన మినహా మరే పనులు చేపట్టలేదు. మిగిలిన చెరువు గర్భం నీటిని పంట పొలాలకు అందించడం, వెళ్లలేని ప్రాంతాలకు బోరు బావులు వేయించాలి. రైతులను అన్ని విధాలుగా చైతన్యపరచి అధిక వ్యవసాయ ఉత్పత్తులు సాధించే విధంగా తీర్చిదిద్దాలి. అయినా నేటి వరకు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. ఒకటి, రెండు సార్లు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి మమ అనిపించారు. రైతు సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న ప్రభుత్వం చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించి నాలుగేళ్లవుతున్నా పురోగతి లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి యానాద్రి చెరువు ఆధునికీకరణ పనులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూర్చాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

పెదవాల్తేరు, జనవరి 23: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని వాడవాడలా టీడీపీ శ్రేణులు మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల విద్యార్థుల మధ్య తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో పరిణితి చెంది ప్రజాసేవలో దూసుకుపోతున్న లోకేశ్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రజలకు మరింత చేరువయిందని అన్నారు. రాష్ట్రానికి లోకేశ్ లాంటి యువ నాయకత్వం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చోడే వెంకట పట్టాభిరామ్, బైరెడ్డి పోతన్నరెడ్డి, సత్తిబాబు, నరేంద్ర, వాసు, దేముడుబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో ఫ్లెక్సీతో విషెస్

భీమునిపట్నం: నారా లోకేశ్‌కు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ మంగళవారం భీమిలి బీచ్‌లో వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హ్యాపీ బర్త్‌డే లోకేశ్ ఫ్లెక్సీని సముద్రంలో ప్రదర్శించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు


చిన్నారికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నిడిగట్టులోని సద్గురు సేవాశ్రమంలో తుపాకుల సంతోష్‌రాజా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. గంటా నూకరాజు, డి.ఎ.ఎన్. రాజు, గాడు చిన్నికుమారిలక్ష్మి, కోరాడ రమణ, పాసి నరసింగరావు, తమ్మిన సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: గ్రేటర్ 7 వ వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, పిళ్లా నరసింగరావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కానూరి అచ్యుతరావు, పోతిన నాయుడు, బుజ్జి, రాము, కిశోర్, సురేశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం: హెచ్‌బీకాలనీ జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నారా లోకేశ్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, సిహెచ్.గోవింద్, మళ్ల వెంకట్, ఆర్.నూకరాజు, కె.మహేష్, కర్రి గౌరి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, సోని పాల్గొన్నారు. 16వ వార్డులో ఇసుకతోటలో జరిగిన కార్యక్రమంలో నారు గోపి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, జి.అప్పన్న, మొల్లి శంకర్, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్: జీవీఎంసీ 9వ వార్డు రామాలయం వీధిలో అక్కరబోయిన రాంబాబు, వెజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. వెంపాడ శ్రీనివాసరెడ్డి, వెంకన్న, సబ్బి శివ, కొండలరావు, శ్రీను, నూకరాజు, ఎం.భూషణం, ముకేష్, చెన్నా శంకర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: గ్రేటర్ 12వ వార్డు టీడీపీ కార్యాలయంలో ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదినోత్సవం నిర్వహించారు. కేక్ కట్‌చేసి, పంపిణీ చేశారు. ఒమ్మి పోలారావు, సన్యాసిరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డులో ధర్మారావు, 11 వార్డులో రాగతి అమృతరావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సురేష్, మజ్జి రమణి, బాలస్వామి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్: గ్రేటర్ 8వవార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో సాగర్‌నగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి యువనేతకు శుభాకాంక్షలు తెలిపారు. బి.దొరబాబు, శ్రీనివాసరావు, చిన్నగోపి, జనసేన నేత శేఖరి శ్రీనివాస్, మంగాదేవి, సన్యాసిరావు, బాబూరావు పాల్గొన్నారు.


భీమిలి పార్టీ కార్యాలయంలో వేడుకలు


పిల్లకోమటివానిపాలెంలో కేక్‌కట్ చేస్తున్న నేతలు

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: మేయర్


శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరికుమారి

ఆరిలోవ, జనవరి 23: నగర వాసులకు మౌలిక వసతుల కల్పనే జీవీఎంసీ ధ్యేయమని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. మంగళవారం గ్రేటర్ 11, 12 వ వార్డుల పరిధిలోని ఆరిలోవ, పెదగదిలి, సూర్యతేజనగర్. బీఆర్‌టీఎస్ రోడ్డులో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గొలగాని శ్రీనివాసరావు, రాజాబాబు, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు


పార్టీలో చేరిన వారితో వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, జనవరి 24: జనసేనపార్టీలో చేరడానికి యువత ఆసక్తి చూపుతోందని ఆ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణయాదవ్ చెప్పారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైసీపీ సచివాలయ కన్వీనర్లు, మత్స్యకార నేతలను ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. సచివాలయ కన్వీనర్లు సురుసపల్లి శ్రావణి, కోలా సుధారాణి, మత్స్యకార నేత కోనాడ ప్రదీప్, పెద్దింటి హరీష్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ధవళ ఫణి, అడ్డాల సురేష్, సాయినాయుడు, అనిల్, జగదీష్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థినులకు స్మార్ట్‌విజన్ గ్లాసెస్ పంపిణీ

సాగర్‌నగర్, జనవరి 23: స్థానిక అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం స్మార్ట్‌విజన్ గ్లాసెస్‌ను పంపిణీ చేశారు. భారత పెట్రోలియం కార్పొరేషన్, రోటరీక్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలకు ఎ1 పవర్డ్ స్మార్ట్ గ్లాసెస్‌ను అందించారు. ఆయా సంస్థల ప్రతినిధులు అభిషేక్, రామకృష్ణన్, ప్రిన్సిపాల్ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పరస మహోత్సవం

వెంకోజీపాలెం, జనవరి 23: పాతవెంకోజీపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పరస మహోత్సవం సాగింది. సీతారామాలయం, సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేటి సూర్యనారాయణ, అధ్యక్షులు భీమరశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు వెలగా వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కాళ్ల అప్పలరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, సుధాకర్, సురేష్, రమణ, రఘు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు: ఆర్డీవో భాస్కర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

భీమునిపట్నం, జనవరి 23: రానున్న ఎన్నికల్లో అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా సహకరించాలని ఆర్డీవో ఎస్.భాస్కర్ రెడ్డి కోరారు. కార్యాలయంలో ఎస్ఎస్ఆర్-2024పై మంగళవారం అఖిల పక్ష నేతలతో సమావేశమయ్యారు. ఓటర్ల తుది జాబితాలో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గంగా భీమిలి నిలిచిందన్నారు. బుధవారం నుంచి ఓటు నమోదు చేపడుతున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు సరగడ రఘునాధరెడ్డి, గాడు శ్రీను, టీడీపీ నేతలు గంటా నూకరాజు, డీఏఎన్ రాజు, కాంగ్రెస్ నాయకులు పల్లా వెంకటరావు, గాదం మహేశ్, పాసి రమణ, డిప్యూటీ తహసీల్దార్ జె.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

భీమునిపట్నం, జనవరి 23: మండలాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంలో సభ్యులంతా భాగస్తులు కావాలని ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు(వాసురాజు) కోరారు. మంగళవారం మండల కార్యాలయంలో ఫంక్షనల్ కమిటీలను క్రియాశీలకం చేయడంపై సమీక్షించారు. వ్యవసాయం, పశుపోషణ, మత్స్యపరిశ్రమ, తాగునీరు, వాటర్‌షెడ్ల కార్యక్రమాలకు సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ, రోడ్లు, కల్వర్టులు, మురుగు కాలువలకు మౌలిక సదుపాయాల కార్యాచరణ కమిటీ, విద్య ఆరోగ్యం, పరిశుభ్రత, సంక్షేమానికి మానవ వనరుల యాజమాన్య కమిటీలను నియమించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ప్రసాదరాజు, సూర్యనారాయణ, ఎంపీడీవో డా.వి.జానకి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొగమంచుతో మామిడి పూతకు నష్టం

మధురవాడ, జనవరి 23: ఈ ఏడాది మామిడి పూతకు పొగమంచు నష్టం కలిగిస్తోంది. బక్కన్నపాలెం, శివశక్తినగర్, కొమ్మాది, పరదేశిపాలెం ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటల్లో చెట్లు పూతతో ఉన్నాయి. పొగమంచు విపరీతంగా కురుస్తుండడంతో పూత మాడిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


కొమ్మాదిలో చెట్టుకు పూత

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

భీమునిపట్నం, జనవరి 24: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ దంతులూరి వెంకట శివ సూర్యనారాయణ రాజు(వాసురాజు), జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, ఎంపీడీవో జానకి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. బీచ్ రోడ్డు జీఎస్ఆర్ భవన్‌లో ఆదర్శహిందీ ప్రేమి మండలి అధ్యక్షులు కేఎస్ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో నేతాజీ జయంతి సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

తగరపువలస: స్థానిక బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఆయన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతుందని హెచ్ఎం అప్పలరాజు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, మల్లిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు

బాపూజీ కళామందిర్‌లో...

కొమ్మాది: సుభాష్‌చంద్రబోస్ లాంటి ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే స్వేచ్ఛాస్వాతంత్రాలతో జీవించగలుగుతున్నామని మధురవాడ వైసీపీ నాయకులు అన్నారు. మంగళవారం నేతాజీ జయంతి సందర్భంగా చంద్రంపాలెం బాపూజీ కళామందిర్‌లోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, బొట్టా అప్పలరాజు, పిళ్లా సూరిబాబు,కుడితి రామారావు, సియాద్రి కనకరాజు, పిళ్లా రమణ, పాల్గొన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్లాష్ మాబ్ రేపు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓఎస్‌డీ లక్ష్మీనారాయణ, నిర్వాహకులు

వెంకోజీపాలెం, జనవరి 23: ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25న ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కె.హేమంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఇంజనీరింగ్ కళాశాల ఓఎస్‌డీ ఆచార్య లక్ష్మీనారాయణ, చీఫ్ వార్డెన్ ఆచార్య చిట్టిబాబు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల విభాగాధిపతి ఆచార్య ఎన్.ప్రజ్ఞలతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 25న మధ్యాహ్నం 3.30 గంటలకు కళాశాల బాస్కెట్ బాల్ మైదానంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందరూ సమానమే నినాదంతో సామాజిక సందేశాన్ని చాటేలా చేపడుతున్నామన్నారు.

జోడుగుళ్లపాలెం తీరంలో దుకాణాల తొలగింపు


దుకాణాలను తొలగిస్తున్న వ్యాపారులు

విశాలాక్షినగర్, జనవరి 23: జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం తీరంలో మంగళవారం దుకాణాల తొలగింపు ప్రక్రియను స్థానిక టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు అడ్డుకున్నారు. దుకాణాలు తొలగిస్తే ఉపాధి కోల్పోతారన్నారు. వార్డు కార్పొరేటర్ జోక్యంతో అదే ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. దీంతో వ్యాపారులు షాపులను విశాలాక్షినగర్ మలుపులోని రహదారిలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ తీరంలో ఆటవీశాఖకి చెందిన సుమారు ఆరు ఎకరాల స్థలాన్ని జీవీఎంసీకి బదలాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈక్రమంలో దుకాణాల తొలగింపు చర్యలను జీవీఎంసీ గత నెల నుంచి ప్రారంభించింది.

ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి : డీఎంహెచ్ఓ


రెడ్డిపల్లిలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పద్మనాభం, జనవరి 23: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి.జగదీశ్వరరావు చెప్పా రు. రెడ్డిపల్లిలో మంగళవారం శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజల ముంగిటకే డాక్టర్లు వచ్చి పరీక్షలు చేస్తున్నారన్నారు. 531 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వప్న, డాక్టర్ మణికుమారి, టీబీ సూపర్‌వైజర్లు ప్రేమ్‌కుమార్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై రైతుల ఆందోళన


కృష్ణాపురం రచ్చబండ వద్ద రైతుల సమావేశం

పద్మనాభం, జనవరి 23: మండలంలోని కృష్ణాపురంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు రైతుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్ల బిగించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు గ్రామంలోని రచ్చబండ వద్ద మంగళవారం రాత్రి సమావేశమైన రైతులు విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండానే పొలంలో లేని సమయంలో వెళ్లి మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఆ సమయంలో రైతులు ఉండి అభ్యంతరం చెబితే బిగించడంలేదన్నారు. ఈ మీటర్ల వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించకుండా ఏర్పాటు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఎం.అప్పలనాయుడు, టీడీపీ నాయకులు ఎస్.పైడినాయుడు పలువురు రైతులు పాల్గొన్నారు.

'వెంకటేశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి '



వెంకటేశ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆనందపురం జనవరి 23: పట్టుదలతో కూడిన విద్యాభ్యాసంతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తోమరోతు వెంకటేశ్ నిరూపించాడని గాయత్రి డిగ్రీ కళాశాల డైరెక్టరు బెల్లాన రామకృష్ణ అన్నారు. ఎస్ఐ ఉద్యోగ పోటీ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చూపిన కళాశాల పూర్వ విద్యార్థి వెంకటేశ్‌ను కళాశాల యాజమాన్యం మంగళవారం సత్కరించింది. ప్రిన్సిపాల్ దుక్క అప్పలరాజు మాట్లాడుతూ విద్యా దశలోనే మంచి వ్యక్తిత్వం, భవిష్యత్తపై ఆలోచనలు చేయాలన్నారు. కరస్పాండెంట్ యర్రాజీ వెంకటరావు, అధ్యాపకులు సునీత, సురేష్‌రెడ్డి, పద్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాల మరమ్మతులు


రహదారిపై కార్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, జనవరి 23: ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో కార్లకు మరమ్మతులు చేపడుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీచ్ రోడ్డు నుంచి ఎం.వి.పి. కాలనీ మీదుగా ఇసుకతోట జాతీయ రహదారిని కలిపే డబుల్ రోడ్డులో కార్ల షెడ్లు నిర్వహణతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడకు వచ్చే వాహనాలు అధిక సంఖ్యలో ఉండడంతోపాటు రోడ్డుపై కార్లు నిలిపి మరమ్మతులు చేస్తున్నారు. అలాగే, ప్రైవేట్ ట్రావెల్స్ నిలిపిస్తుండడంతో రద్దీ నెలకొంటోంది. ప్రధానంగా సాయంత్రం వేళల్లో మరీట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అయినా, ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బందికానీ పట్టించుకోకపోవడంతో ప్రయాణికు లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.